'ఉస్మా' ఆధ్వర్యంలో ఉచిత బస్సులు

నవతెలంగాణ -నల్గొండ టౌన్

మహాశివరాత్రి పురస్కరించుకోని పానగల్ లోని ఛాయా సోమేశ్వర ఆలయంలోని ముక్కంటి దర్శనానికి వచ్చె భక్తుల సౌకర్యానికి ఉస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బస్సులు గురువారం న్యూస్ స్కూల్ ఆవరణలో ట్రస్మా జిల్లా సెక్రెటరీ జి. విరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, వృద్ధులు, మహిళలు ఛాయా సోమేశ్వరాలయానికి చేరుకొని స్వామిని దర్శించుకునేందుకు ఈ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సౌకర్యాన్ని అందరు వినియోగించుకోవాలని ఆలయ అభివృద్ధి కమిటి చైర్మెన్ గంట్ల అనంతరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ట్రస్మా పట్టణ అధ్యక్షులు అజీజ్, భిక్షం, రవి పర్వత రెడ్డి, మనోహర్, లక్ష్మణ్, పద్మ స్పందన, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు గైర్హాజరు

నవ తెలంగాణ- నార్కట్ పల్లి

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం గణితం జువాలజీ గురువారం జరిగిన పరీక్షల్లో నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 119 మంది విద్యార్థులకు గాను 117 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎండి.ఇస్మాయిల్ పేర్కొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని చిన్న నారాయణపురం లోగల బాలికల గురుకుల కళాశాలలో మొత్తం 113 మంది విద్యార్థులకు గాను 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి.రమాదేవి పేర్కొన్నారు. రెండు కేంద్రాల్లో నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

అవనిలో సగం.. ఆకాశంలో సగం

నేడు మహిళా దినోత్సవం

అన్నింటా సగం అయిన మహిళలకు ఎటువంటి హక్కులు ఉండేవికావు. కానీ పోరాడితే పోయేది లేదు బానిస సంకెళ్లు తప్ప అనే పిలుపు మహిళల్లో చైతన్యస్ఫూర్తిని రగిలించింది. పురుషాధ్యికత నుంచి స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి చట్టాలు తీసుకొచ్చినా ఇంకా పోరాటాలు చేయక తప్పడం లేదు . ఈనాటికి కూడా. ఎన్ని చట్టాలు వచ్చినా ఆడపిల్లలమీద అఘాయిత్యాలకు అడ్డుకట్ట పడటంలేదు. దుర్భర దుస్థితుల నుంచి పోరాటం స్ఫూర్తితో పుట్టింది అంతర్జాతీయ మహిళా దినోత్సవం. అమెరికాలోని ఇల్లినాయ్ రాష్ట్రంలోని చికాగో నగరంలో ప్రారంభమైన మహిళా దినోత్సవం ఇప్పుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. మహిళల పోరాటంలోంచి కార్మిక ఉద్యమం నుంచి పుట్టిందీ మహిళా దినోత్సవం..



నవతెలంగాణ -నల్లగొండ టౌన్

మహిళలు తమ బాధలు, సమస్యలను చర్చించుకోవడానికి, నలుగురితో పంచుకోవడానికి ఒక రోజు ఉండాలని నిర్ణయించారు మహిళలు. ఆ రోజును మహిళా దినోత్సవంగా ప్రకటించారు. తొలిసారి అమెరికాలోని చికాగోలో మహిళా దినోత్సవానికి 1908లోనే బీజాలు పడ్డాయి. మహిళలకు పనిగంటలు, పనికి తగిన వేతనం, ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటీలో 15 వేల మంది మహిళలు ప్రదర్శన చేశారు. వారి డిమాండ్లతో అమెరికాలోని సోషలిస్టుపార్టీ 1909వ సంవత్సరంలో ఫిబ్రవరి 28న జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. జాతీయ మహిళా దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని కోపెన్‌హెగెన్ నగరంలో 1910లో జరిగిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్' సదస్సులో క్లారా జెట్కిన్ ఈ ప్రతిపాదన చేశారు. 17 దేశాల నుంచి ఈ సదస్సుకు హాజరైన 100 మంది మహిళలు క్లారా జెట్కిన్ ప్రతిపాదనను ఏకగ్రీవంగా అంగీకరించారు. అలా మహిళలకు ఓటుహక్కు, సమానహక్కు సాధించడానికి ఇలాంటి సమావేశాలు నాందిపలికాయి.

1911 మార్చి 19న 10 లక్షల మందికి పైగా ఆస్ట్రియా, డెన్మార్క్, స్విట్జర్లాండ్ దేశ మహిళలు ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో ఓటుహక్కు, ప్రభుత్వ పదవులు కావాలని డిమాండ్ చేశారు. ఉపాధిలో లింగ వివక్షను వ్యతిరేకించారు. అమెరికాలో మాత్రం ప్రతి ఫిబ్రవరి చివరి ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. 1913లో తొలిసారిగా రష్యన్ మహిళలు ఫిబ్రవరి చివరి ఆదివారం మహిళా దినోత్సవాన్ని జరిపారు.మహిళలు తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికి, హక్కుల సాధనకు ఎన్నో పోరాటాలను ఒక్కో దేశంలో ఒక్కో పద్ధతిలో చేశారు. కానీ ఎవరు ఎటువంటి పద్ధతిలో పోరాటాలు చేసినా అవన్నీ మహిళల హక్కుల కోసమే జరిగాయి. 1914 నుంచి చాలా దేశాల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

మహిళల పోరాటాలతో సాధించిన విజయాలు...

1814లో జర్మనీలో మహిళా దినోత్సవం నిర్వహించి ఓటుహక్కు కావాలని తీర్మానం చేశారు. 1918 వరకు మహిళలకు అక్కడ ఓటుహక్కు లభించలేదు. 1917లో (గ్రెగెరియన్ క్యాలెండర్ ప్రకారం మార్చి8) సెయింట్ పీటర్‌బర్గ్ మహిళలు మొదటి ప్రపంచ యుద్ధం, రష్యాలో ఆహార కొరత నివారించాలని డిమాండ్ చేశారు. అదే రోజున వస్త్ర పరిశ్రమలోని మహిళా శ్రామికులు అధికారుల హెచ్చరికలను లెక్క చేయకుండా వీధుల్లోకి వచ్చి..హక్కుల కోసం నినాదాలు చేశారు.మార్చి 8న అధికారిక సెలవుగా ప్రకటించడానికి బోల్షెవిక్, అలెగ్జాండర్,కొలెన్టైల్‌లు వ్లాదిమిర్ లెనిన్‌ను ఒప్పించారు. కానీ అది 1965 నాటి దాకా అమల్లోకి రాలేదు.

చైనాలో 1922 నుంచి మహిళా దినోత్సవాన్ని ప్రకటించినా సగం సెలవు రోజుగా పేర్కొన్నారు.1977 తర్వాత ప్రాచ్య దేశాల్లో మహిళా దినోత్సవానికి ప్రత్యేకత వచ్చింది. మహిళల హక్కులు, ప్రపంచ శాంతి దినంగా మార్చి 8ని ప్రకటించాలని పిలుపువచ్చింది.అమెరికా 1994లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బిల్లును తయారు చేసింది.కాగా..ఇన్ని పోరాటాలు చేసినా..ఇన్ని త్యాగాలు చేసినా ఇంకా మహిళల సాధికారత ఇంకా ప్రశ్నార్థకంగానే ఉండటం దురదృష్టకరం. మహిళ కోసం వారి హక్కుల కోసం ఓ రోజును సాధించుకోవటానికి ఆనాటి మహిళా మణులు చేసిన పోరాటాలు ఎన్నో ఎన్నెన్నో..దిశను..నిర్దేశాన్ని వారే రచించుకున్నారు. మహిళా దినోత్సవాన్ని సాధించుకోవడానికి పలు దేశాల్లోని మహిళలు దశాబ్దాలుగా పోరాటాలు చేయాల్సి వచ్చింది. మహిళలు అంతరిక్షం నుంచి కుటుంబం దాకా సాధించిన ప్రగతి ఒక్క రోజులో సాధ్యం కాలేదు. ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న విజయమిది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత శిఖరాల్లో నిలిచిన మహిళకు ఇంకా లింగ వివక్ష హింస, దురాగతాలు తప్పడం లేదు. మహిళా దినోత్సవం జరుపుకోవటం ప్రారంభమై 100ఏళ్లు దాటినా ఇంకా మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు కూడా దక్కకపోవటం విచారకరమనే చెప్పాలి.

స్త్రీ లేనిదే సృష్టి లేదు...

ఎస్పీ చందన దీప్తి



నల్లగొండ...

స్త్రీ లేనిదే జననం లేదు. స్త్రీ లేనిదే గమనం లేదు. స్త్రీ లేనిదే మనుగడ లేదు, స్త్రీ లేనిదే అసలు సృష్టే లేదు. జగతిలో స్త్రీకి ఉన్నత స్థానం కలదు. మహిళలు చట్టాల పైన, వారి హక్కుల పైన అవగాహన కలిగి ఉండాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి. వారి హక్కుల సాధన కోసం పోరాడాలి. మహిళా సాధికారత దిశగా సాగాలి. ముఖ్యంగా మహిళలు దిశ యాప్ పై అవగాహన కలిగి ఉండాలి. బాలికలు బాల్య వివాహాల పై జాగ్రత్తగా ఉండాలి. చదువు పట్ల శ్రద్ధ వహించాలి. అలాగే ఈవిటీజింగ్ చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండి అలాంటి వారిపై పోలీసుల దృష్టికి తీసుకురావాలి. స్త్రీ ఒక మాతృమూర్తిగా, ఒక చెల్లిగా, ఒక అక్క గా మగవాడి జీవితం లో సగభాగంగా ఉండడం గమనార్హం.

స్త్రీలకు స్వేచ్ఛ ఉండాల్సిందే...

పాలడుగు ప్రభావతి ,ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నల్గొండ



సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నప్పటికీ తీవ్రమైన వివక్ష ఎదుర్కొంటూ బానిసగా చూస్తున్నారు. పురుషులకు సేవ చేసే మహిళగా పిల్లలు కనే యంత్రంగా , వంటింటికే పరిమితం చేయడం అన్యాయం. స్త్రీలకు స్వేచ్ఛ ఉండాల్సిందే. స్త్రీ పురుషులకు సమాన వేతనాలు ఇవ్వాలి. స్త్రీలపై జరుగుతున్న లైంగికదాడులు, హత్యలు , గ్యాంగ్ రేప్ , లాంటి ఘటనపై కఠినంగా శిక్షించుటకు త్వరితగతిన తీర్పు వెలువరించడానికి అనుకూలమైన పరిస్థితులు ప్రభుత్వాలు కల్పించాలి. ముఖ్యంగా చిన్నారులు వృద్ధులకు రక్షణ కల్పించాలి. ప్రతి మార్పు ప్రతి ఇంటి నుండి జరగాలి. తమ్ముడితోపాటు చెల్లిని సమానంగా చూసే పరిస్థితులు రావాలి. విద్యార్థి దశ నుండే సాధికారతపై పాఠాలు బోధించాలి. క్రమశిక్షణ నేర్పించాలి. మగవారి ప్రవర్తనలో మార్పు రావాలి మద్యం మత్తు పదార్థాలు నిషేధించాలి. వాటిని వ్యాపారంగా మలుచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే మహిళ స్వేచ్ఛగా తిరగ గలుగుతుంది సమాజం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంది.

మహిళల సాధికారత నేటికీ నెరవేరలేదు

డాక్టర్ సంపద సూరెపల్లి
ఎంబిబిఎస్, ఎంఎస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మెడికల్ కాలేజ్ నల్గొండ...



మహాత్మాగాంధీ ఆడది అర్ధరాత్రి నడిరోడ్డుపై నడిచి వెళ్లినపుడే నిజమైన స్వాంతంత్ర్యం అన్నారు. కానీ నేడు పట్టపగలే మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మహిళలకు తగిన సౌకర్యాలు భద్రత కల్పించటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఫలితంగా మహిళలపై వేధింపులు, హింస, లైంగికదాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఆహార పదార్థాల ధరలు పెరగటం వల్ల పౌష్టికాహార లోపంతో మహిళలు అనారోగ్యానికి గురవుతున్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, శ్రామిక మహిళలకు బీమా సౌకర్యం, అంగన్వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన వర్కర్లు, పారిశుధ్య వర్కర్లను ప్రభుత్వం గుర్తించి కనీస వేతనాన్ని అందించనప్పుడే మహిళలకు నిజమైన సాధికారిత, మహిళా దినోత్సవానికి సార్థకత చేకూరుతుంది.

అవరోధాలను అధిగమిస్తూముందుకు సాగాలి

తుమ్మల పద్మ, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు, నల్లగొండ....



సృష్టికి మూలం స్త్రీ. స్త్రీ లేకపోతే సృష్టేలేదు. అంతటి మహోన్నత శక్తి గలిగిన మహిళ నేటి నవ సమాజంలో సాటి సభ్యసమాజాన్ని చూసి కన్నీరు పెడుతోంది. ఆడపిల్ల పుట్టిందంటేనే భారంగా భావించే దుస్థితి దేశంలోనే ఉన్నది. బయటి ప్రపంచాన్ని చూడకుండానే చాలా మంది ఆడపిల్లలు అసువులుబాస్తున్నారు. ఆడపిల్లను కనడం, చదివించటం, పెండ్లి చేయటం, భారంగా భావించే తల్లిదండ్రులు దేశంలో చాలా మంది ఉన్నారు. అసలు ఆడపిల్ల పుట్టిందంటేనే పెద్ద శిక్షగా భావించటం వల్ల ఆడపిల్లల సంఖ్య రోజుకు రోజుకు క్షీణిస్తుంది. విద్య వైద్యం, వ్యాపారం, రాజకీయం, క్రీడలు, అంతరిక్షం, టెక్నాలజీ రంగం ఏదైనా మహిళలు పురుషులకు సమానంగా ప్రతిభను చాటుకుంటున్నారు. మహిళలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగాలి.

అవకాశాలు అందిపుచ్చుకొని మహిళలు మరింత ముందుకు రావాలి

మామిడి ప్రమీల పీపీ, నల్గొండ



ఎడ్యుకేషన్ పరంగా ఆడపిల్లలకి అన్ని రకాల రిజర్వేషన్లు కల్పించడం ద్వారా అత్యున్నతమైన స్థానాల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత కాలంలో ఆడపిల్ల పుడితే కుటుంబమంతా పండగ చేసుకునే రోజుల్లో మనం ఉన్నప్పటికీ మహిళలపై అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు మాత్రం నానాటికీ పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు మహిళా చట్టాలను కఠినతరం చేసి మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉంది. ప్రతి విషయంలో కూడా స్త్రీ, పురుషులిద్దరూ సమానమైన ప్రాధాన్యత ఉన్నప్పటికీ మహిళలు మరింత ముందుకు వచ్చి అన్ని రంగాల్లో అభివద్ధి చెందాలి.

రాజకీయ,ఆర్థిక, సామాజిక రంగాల్లో సమానత్వం కల్పించాలి

- **మల్లు లక్ష్మి ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

నవతెలంగాణ- నల్లగొండ టౌన్



మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమానత్వం కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లాకేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో సదస్సును పాలపోయిన వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, స్త్రీవిముక్తి కోసం జరిగే పోరాటాలకు స్ఫూర్తినిచ్చే రోజు మార్చి 8 అని అన్నారు న్యూయార్క్ నగరంలో కుట్టు మిషన్ లో పనిచేసే శ్రామిక మహిళలు ఎనిమిది గంటల పని దినం కావాలని,పని ప్రదేశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, శ్రమకు తగ్గ వేతనం కావాలని, ఓటు హక్కు కావాలని, రక్తతర్పణం చేసి హక్కులు సాధించుకున్నారని తెలిపారు. వారి త్యాగాలు వెలకట్టలేనివన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ విద్య, వైద్యం, క్రీడల్లో, శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుకు పోతున్నా వివక్ష అసమానత లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లింగ సమానత్వ సూచిలో 146 దేశాలకు గాను 127 స్థానంలో మన దేశం ఉందన్నారు. సాధించుకున్న హక్కులు నిర్వీర్యమవుతున్నాయన్నారు. మహిళల హక్కులు పరిరక్షించ బడాలంటే నిర్ణయ అధికారంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. మహిళలకు పని, భద్రత కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. వాటిని కల్పించే వరకు మహిళలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ మహిళలపై హింస, లైంగిక వేధింపులు అనేక రూపంలో జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విఫల మవుతున్నాయన్నారు. మహిళలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాళ్లు కొండా అనురాధ, జిట్ట సరోజ, తుమ్మల పద్మ జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగ మణి, జిల్లా సహాయ కార్యదర్శి భూతమ అరుణకుమారి, జిల్లా సహాయ కార్యదర్శి కారంపొడి ధనలక్ష్మి, చనబోయిన సైదమ్మ, ఎస్ కె సుల్తానా, గొల్ల వెంకటమ్మ, ఊర్మిళ, అరుణ, కృష్ణవేణి, ఇందిరా, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ వరుణ, సభ్యురాలు మంజుల, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- **ఎమ్మెల్యే వేముల వీరేశం**

నవతెలంగాణ -చిట్యాలటౌన్



పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం మండలంలోని వట్టిమర్తి గ్రామంలో పది లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డ్ లో గల సిరి వెంచర్ నుండి ఎన్‌హెచ్65 వరకు రూ.25 లక్షలతో నిర్మించనున్న స్ట్రోం వాటర్ డ్రెన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వేముల వీరేశం,మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్నవెంకటరెడ్డి తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు.పట్టణాల రూపురేఖలను మార్చి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సంక్షేమం విషయంలో ప్రభుత్వం రాజీపడే ప్రసక్తి లేదన్నారు. నకిరేకల్ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ యాదగిరి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోకల దేవదాసు, మండల పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీ నరసింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కాటం వెంకటేశం, నర్రా మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు జడల పూలమ్మ చిన్న మల్లయ్య, బెల్లీ సత్తయ్య, కోనేటి కృష్ణ, రేముడాల లింగస్వామి, మారగోని ఆంజనేయులు, గంట శ్రీనివాసరెడ్డి, జంపాల వెంకన్న ,పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



చేనేతకు చేయూత

- **ఎమ్మెల్యే బీఎల్ఆర్**

నవతెలంగాణ-మిర్యాలగూడ

చేనేత కార్మికులకు చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. కళాభారతి ఆధ్వర్యంలో పట్టణంలోని రెడ్డి కాలనీలో సమ్మిడి వీరారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శనను గురువారం సాయంత్రం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ప్రజలు ఆదరించాలన్నారు. ప్రాశత్య సంస్కృతిని వీడి దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలన్నారు. చేనేత వస్త్రాలు ధరించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులకు చేయూత నివ్వాలన్నారు. అన్ని రకాల పట్టు వస్త్రాలు చేనేత దుస్తులులు అందుబాటులో ఉన్నాయని పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 24 వరకు ప్రదర్శన ఉంటుందని ప్రజలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి, తలాభారతి అధ్యక్షులు జెల్ల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి శనిగరం కిషోర్ ,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా 56 శాతం మహిళలు

- **కల్యాణ లక్ష్మి ,షాది ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే**

నవతెలంగాణ-దేవరకొండ



కాంగ్రెస్ ప్రభుత్వానికి 56 శాతం మహిళలు అండగా ఉన్నారని నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 245 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని గత ప్రభుత్వంలో ఖజానా ఖాళీ అయినందున డబ్బులు సర్దుబాటులో ఆలస్యం జరుగుతుందన్నారు .మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తూ, ఆర్టీసీకి ఆదాయం వచ్చే విధంగా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల రూపాయలతో కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం చేసుకోవచ్చునన్నారు .ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హత లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు .ఈ నెల 11వ తేదీన భద్రాచలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న తెలిపారు. దేవరకొండ నియోజకవర్గం3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీరాములు, దేవరకొండ, చందంపేట ఎంపీపీలు నల్ల గా సు జాన్ యాదవ్ ,పార్వతి చందు నాయక్, చందంపేట జెడ్పిటిసి బుజ్జి లచ్చిరాం, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి గొప్పది

- **సెయింట్ జాన్స్ పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవం**

నవతెలంగాణ- మిర్యాలగూడ



మహిళా శక్తి గొప్పదని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సెయింట్ జాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డి కోరారు మహిళా దినోత్సవ సందర్భంగా గురువారం పాఠశాలలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించి సత్తా చాటాలన్నారు చాటాలన్నారు. అంతరిక్షాన్ని వీక్షించి తమ సామర్థ్యాన్ని నిరూపించారన్నారు. విద్యా ఉద్యోగం ఉపాధి రంగాలలో మహిళలు సముచిత స్థానం పొందుతున్నారని చెప్పారు. మహిళలు విద్యలో రాణించినప్పుడే ఇంటి అభివృద్ధితోపాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వాలు మహిళలకు రిజర్వేషన్ కల్పించి వారిని గౌరవిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష, ఉపాధ్యాయులు పద్మ, నాగలక్ష్మీ, భవాని, పరమేశ్వరి, సుజాత, ఫరీన్, నిర్మల, రమ్య, కావ్య, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవ తెలంగాణ- నార్కట్ పల్లి



మహాత్మా గాంధీ యూనివర్సిటీ సైన్స్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్- 2,3,4 ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్.డాక్టర్ మద్దిలేటి , ప్రిన్సిపల్,సైన్స్ కళాశాల.డాక్టర్ కే. ప్రేమ్ సాగర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఉద్దేశించి మహిళల యొక్క సాధికారత,వైద్యవిద్య,శాస్త్ర సాంకేతిక రంగాలలో వారి యొక్క ప్రాధాన్యత , వారి సేవలు ఎంతో విలువైనవి వెలకట్టలేనివి అని పేర్కొన్నారు. . ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాలకు చెందిన మూడు యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు జి. సుధాకర్, డాక్టర్ పి. శ్రీను, బి .వీరస్వామి, డాక్టర్ శ్రావ్య , విద్యార్థులు పాల్గొన్నారు.

ధరణి సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- తహసీల్దార్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-నూతనకల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ధరణి సేవా కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రం లోని తహసిల్దార్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన ధరణి సేవా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమకు ఉన్న భూ సమస్యలను పరిష్కరి ంచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని భూసమస్యలు ఉన్నవారు ధరణి సేవా కేంద్రానికి వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్రీధర్ నాయక్, ఆర్ఐ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సూర్యాపేట

ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలి

నవతెలంగాణ-మోతే



ఇండ్లు లేని పేదలందరికీ 150 గజాల ఇంటి స్థలం ఒక్కొక్క కుటుంబానికి ఇచ్చి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తానన్న ఐదు లక్షల రూపాయలు విడుదల చేయాలని తెలంగాణ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెళ్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .గురువారం నడిగూడెం మండల పరిధిలోని రామాపురం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా నాయకులు ఏనుగుల వీరాం జనేయులు సింగం జిల్లా నాయకులు పులుసు సత్యం సోమపంగు జానయ్య ఆరె రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళా అభివృద్ధితోనే దేశం పురోగతి

- కలెక్టర్ ఎస్ .వెంకట్రావ్
- మహిళలను సన్మానించిన కలెక్టర్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



సమాజ సేవలో మహిళలు ముందు ఉండటం, ఓర్పు, సహనంతో కుటుంబాలను తీర్చిదిద్దుతారని మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగతిలో ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు.గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్లతాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ జిల్లాలో అదనపు కలెక్టర్లు ఇద్దరు కూడా మహిళలు కావటం చాలా అదృష్టంగా భావిస్తున్నాని, వారి సహకారంతో జిల్లాను అభివృద్ధిలో ముందుంజలో ఉంచుతాన్నని, అర్హులైన వారు చివరి వరసలో ఉన్నవారికి పథకాలు అందేలా కృషి చేస్తాన్నాని తెలిపారు. జిల్లాలో ఉన్న మహిళలు గ్రూప్ లగా ఏర్పడి, బ్యాంక్ల ద్వారా లోన్లు తీసుకొని నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేస్తూ మన జిల్లాలోనే కాదు వేరే జిల్లాలకు కూడా ఎగుమతి చేయటం శుభపరిణామం అని తెలిపారు. పీఎం ఎఫ్ఎంఈలో మన జిల్లాను మొదటి ర్యాంక్లో ఉంచిన్నందుకు మహిళలందరికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల కు ఓర్పు, సహనం, సమయ స్ఫూర్తి ఎక్కువ గా ఉంటాయని,మహిళలు ఎక్కడ అయితే పూజిస్తారో అక్కడ సకల దేవతలు కొలువై ఉంటారని, స్త్రీ లేనిదే మానవ మనుగడ లేదని తెలిపారు.అలాగే పని చేసే ప్రదేశాలలో మహిళలను ఎవరైనా వేధించిన,అగౌరవ పర్చిన వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటాన్నని తెలిపారు.తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు మహిళలు గురించి పాడిన పాటలు బాగున్నాయని వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

మహిళలపై వివక్ష చూపొద్దు

జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)బి ఎస్ లత మాట్లాడుతూ మహిళలపై ఎవరు వివక్షచూపరాదని, పిల్లలని తప్పటడుగులు వేయకుండా మహిళల పట్ల గౌరవంగా ఉండేలా పెంచాలని, కుటుంబ బంధాలను బాధ్యతగా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.మహిళల కు విద్య, వైద్యం, ఆస్తి, ఓటు హక్కు అనేవి సమానంగా రాజ్యాంగం ద్వారా పొందామని ఈ అవకాశం కల్పించిన అంబేద్కర్ గారిని కొనియాడారు.మహిళలు అందరు అన్ని రంగాలలో రాణించాలని అలాగే పౌష్టిక ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.వికలాంగులకు ఒక్కొక్క స్కూటీ విలువ1,25,000 రూపాయలు గల 15 స్కూటీలను,అలాగే ఒక్కొక్క ఛార్జింగ్ బ్యాటరీ తో నడిచే త్రి వీలర్ చైర్ విలువ 80,000 రూపాయలు గల 6 త్రి వీలర్ చైర్లను, సుమారు 25 లక్షల రూపాయలు విలువ గల వాహనాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వినికిడి లోపం ఉన్న ఎనిమిది మందికి వినికిడి యంత్రాలు అందజేశారు. మాటలు రాని నలుగురు మూగ విద్యార్థులకు చదువుకొనుటకు నాలుగు సెల్ ఫోన్లు అందజేశారు.

మహిళలను సన్మానించిన కలెక్టర్

జిల్లా కలెక్టర్ మహిళా దినోత్సవ సందర్భంగా అదనపు కలెక్టర్ బిఎస్ లత, డి డబ్ల్యూఒ వెంకట రమణ, జెడ్పీ డిప్యూటీ సీఈవో శిరీష, ఎస్సి వెల్ఫేర్ ఆఫిసర్ లత, అలాగే సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ అన్నపూర్ణ,జెడ్పీటీసీ, ఎంపీపీ, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రభుత్వ ఉద్యోగులనులనుకలెక్టర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ అన్నపూర్ణ, చివేముల ఎంపీపీ కుమారి, మఠంపల్లి ఎంపీపీ పార్వతి,కోదాడ ఎంపీపీ మల్లెల రాణి, పెనపహాడ్ జెడ్పీటీసీ అనిత,కోదాడ జెడ్పీటీసీ మందాలపు కృష్ణ కుమారి,తదితరులు పాల్గొన్నారు.

పంట ఎండిపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

నవతెలంగాణ-ఆత్మకూరు(ఎస్)



వర్షా భావ పరిస్థితులు మరియు భూగర్భ జలాలు అడుగంటడం వల్ల వంట పొలాలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నిమ్మికల్ గ్రామంలో జటంగి వెంకన్న అనే రైతు ఎండిపోయిన పంట పొలాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ యాసంగి కారులో రైతులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు బోరు బావుల ఆధారంగా వరి సాగు విస్తారంగా సాగు చేశారని అన్నారు. కానీ సకాలంలో నీరు లేక , వర్ష భావ పరిస్థితుల వల్ల బోర్లు ఎండిపోయి సాగుచేసిన పంట పొలాలు పెద్ద ఎత్తున ఎండిపోయాయని అన్నారు. రైతులు ఎకరం ఒక్కంటికి దాదాపు 25 వేల నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మికల్ గ్రామంలోని దాదాపు 250 ఎకరాలు వరి పంట ఎండిపోయిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాలలో వరి పంట ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వము మరియు అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారించి ఎకరాకు 25000 నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి ,దండ శ్రీనివాస్ రెడ్డి ,రేణిగుంట్ల రవి, కొల్లు వెంకన్న గంపల ఎల్లయ్య, విజయ్ రెడ్డి, బయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.

కరువు కోరల నుండి కాపాడాలి

- సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పెన్పహాడ్



సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి మండల ప్రజలను కరువు కోరల నుండి కాపాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ కృష్ణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో సాగర్ నీటిపై ఆశపడి నారు పోసిన రైతులకు నీరు లేక చేతికి వచ్చిన పంట కళ్ళముందు ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని వేదన వ్యక్తం చేశారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే మరొక్క పక్క తాగునీరు లేక ప్రజల గొంతు ఎండి పోతుందన్నారు. గ్రామాల ప్రత్యేక అధికారులు నీటి సమస్యతో బాధపడుతున్న గ్రామాలను గుర్తించి వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని కోరారు. ధరణి ద్వారా గతములో ఇబ్బంది పడ్డ రైతులను గుర్తించి వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని, కౌలు రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డ్స్ ఇచ్చి రైతు బంధు వారికీ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చిన్నపంగి నర్సయ్య, వీరబోయిన రవి, ధనియాకుల శ్రీకాంత్, బొమ్మిరెడ్డి గోపిరెడ్డి, కొండమీద రాములు, నెమ్మాది లక్ష్మీ వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్తి మద్దతు'

నవతెలంగాణ-తిరుమలగిరి



రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు దుర్గారావు తెలిపారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో జిల్లా అధ్యక్షులు ఎల్సోజు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ ఫెడరేషన్ కుల సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు సాగుదామన్నారు. బీసీ ఫెడరేషన్ కులాలకు తగిన న్యాయం చేస్తారని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చినందున అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి బీసీ ఫెడరేషన్ కులాల సమితి పూర్తి మద్దతు ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుత రాబోయే పార్లమెంటు ఎన్నికలలో రేవంత్ రెడ్డి పై పూర్తి నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి సంగం మద్దతు ప్రకటిస్తున్నట్లు న తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎల్సోజు నవీన్ కుమార్ ను తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి ఉపేందర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, రాష్ట్ర కోశాధికారి పసుపులేటి కరుణాకర్, తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్, నాయకులు చిక్కులపల్లి శ్రీనివాస్, అడ్డబొట్టు చారి, కస్తూరి ప్రభాకర్, పూసల సోమయాచారి, మడూరు ఉపేంద్ర చారి, రమేష్ చారి, నరేంద్ర చారి ,ఉమేష్, సోమేశ్ మహేష్ పాల్గొన్నారు.

ప్రయివేటు ఉపాధ్యాయులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని వినతి

నవతెలంగాణ-హుజూర్‌నగర్



అర్హులైన ప్రయివేటు పాఠశాల లో పనిచేస్తున్న ఉపాధ్యాయు లందరికీ పట్టణ పరిధిలోని రామస్వామి గట్టు వద్ద ఉన్న ఇండ్లను కేటాయించాలని ప్రయివేటు ఉపాధ్యాయుల అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టే నాగరాజు ఆధ్వర్యంలో ఆర్డీవోకువినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు పట్టణంలోనిప్రయివేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రస్తుతం మంత్రిగా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డిని కలిసి తమకు ఇల్లును కేటాయించారని విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ప్రస్తుతం పట్టణంలో పని చేస్తున్న 60 శాతం పైగా ప్రైవేటు ఉపాధ్యాయులకు సొంత ఇండ్లు లేక వచ్చే తక్కువ జీతంతో అద్దెలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బం దులను ఎదుర్కొం టున్నా రన్నారు.ఇండ్లను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావుల ప్రకాష్ గొట్టే ఆంజనేయులు ప్రధాన కార్యదర్శి కృష్ణకుమారి ప్రచార కార్యదర్శి కవిత సహాయ కార్యదర్శి విజయకుమార్ తమ్మర దివ్య సతీష్ పాల్గొన్నారు.

మహిళలకు విద్య ఎంతో అవసరం

- అడ్వకేట్ ఊర గాయత్రి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చేరుకు ఏకలక్ష్మీ

నవతెలంగాణ-సూర్యాపేట



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్య ఎంతో అవసరమని అడ్వకేట్ ఊర గాయత్రి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చేరుకు ఏకలక్ష్మీలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రామిక మహిళా ఆధ్వర్యంలో గురువారం స్థానిక సిఐటియు ఆఫీసులో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చదివించాలని కోరారు. అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే ఆర్థికంగా సంపాదనలో రాణించగల్గుతారని పేర్కొన్నారు. శ్రామిక మహిళలు పని ప్రదేశాలలో రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. స్కీం వర్కర్లకు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా వర్కర్ల కు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కుట్టు మిషన్ వర్కర్లు మహిళలు ఎంతో ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని వారికి వ్యక్తిగత లోన్లు కనీసం లక్ష రూపాయలు ఇవ్వాలని కోరారు. అనంతరం మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రధాన కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, కుట్టు మిషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి ఉషా, స్వర్ణలత, మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా ఉపాధ్యక్షులు సంకోజు గీత ,సైదమ్మ, నారాయణమ్మ, అంగన్వాడీ ఆయా యూనియన్ పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, శశిరేఖ ,శ్రీలత, ఎస్.కె రజియా బేగం ,ఎస్కే సుల్తానా, పండ్ల యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

'విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి'

నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకొని, క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని తుంగతుర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలుగు రమేష్ అన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఒక్కరోజు పాలనలో విద్యార్థులు నాయకులుగా ప్రజాప్రతినిధులుగా అధికారులుగా ఉపాధ్యాయులుగా తమ పాత్రలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నారని అన్నారు. ఈ స్వపరిపాలన దినోత్సవంలో జిల్లా కలెక్టర్గా పి అజిత్, జిల్లా విద్యాశాఖ అధికారిగా కటకం రిషిచరణ్,మండల విద్యాశాఖ అధికారిగా వినయ్ కుమార్,ప్రధానోపాధ్యాయులుగా ధనుష్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా అర్జున్లు వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉపదేశ, వసుంధర, శ్రీలత విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీళ

నవతెలంగాణ-కోదాడరూరల్



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్పర్సన్ సామినేని ప్రమీళ అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కమిషనర్ రమాదేవితో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారని తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో ఆడ, మగా అనే వివక్ష చూపకుండా పెంచాలని అన్నారు. ఓర్పు, సహనం మహిళలకు వరం లాంటిది అన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులు ప్రేమ, ఆప్యాయతలు చూపి పిల్లలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, కమిషనర్, మున్సిపల్ మహిళ కౌన్సిలర్లను మహిళా పారిశుధ్య కార్మికులు, ఆర్పీలు, మున్సిపల్ మహిళ ఉద్యోగులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలు అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లా ప్రసన్న లక్ష్మీ , తిపిరిశెట్టి సుశీల, మేదర లలిత, కట్టెబోయిన జ్యోతి, కర్రీ శివ, బెజవాడ శిరీష, కోఆప్షన్ సభ్యురాలు వంటేపాక జానకి పాల్గొన్నారు.

కోడిన్ ఫాస్పేట్ మత్తు కోసం వెంపర్లాడుతున్న యువత

నవతెలంగాణ-మఠంపల్లి



మండల కేంద్రంగా దగ్గు మందు సీసాల భారీ దందా హుజూరనగర్ పరిసర ప్రాంతాలలోగంజాయితో పాటు మత్తు కలిగించే నిషేధిత దగ్గుమందు, నిద్ర మాత్రలను పల్లీ బఠాణీలలా అమ్ముతున్నారన్న గుసగుసలు కొన్నాళ్ళనుండి వినిపిస్తున్నాయి బుధవారం రాత్రి మండల కేంద్రంలో గల ఒక మెడికల్ షాపు యజమాని కోడిన్ ఫేస్పెట్ కాంబినేషన్ తో ఉన్న ప్రముఖ కంపెనీకి చెందిన దగ్గు మందు సీసాలను అమ్ముతున్నారన్న సమాచారం మేరకు కోదాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులకు సమాచారం రావడంతో వారు ఉమ్మడి నల్లగొండ జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్కు, సూర్యాపేట డ్రగ్ ఇన్స్పెక్టర్ కు సమాచారం ఇచ్చారు. వారు గురువారం సంబంధిత మందుల దుకాణంలో సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు . దాడులలో అధికారులకు విస్తుగొలిపే వాస్తవాలు వెలుగుచూసినట్లు విశ్వసనీయ సమాచారం .మండల కేంద్రంలో ఉన్న ఆ మెడికల్ షాపు యజమాని గత కొన్నాళ్లుగా కోడిన్ ఫాస్పెట్ దగ్గు మందుతో పాటు, మత్తు కోసం వాడే నైట్రాజపం మాత్రలు కూడా భారీ స్థాయిలో అమ్మకం జరిపినట్లు కనుగొన్నారు. మత్తు కోసం వెంపర్లాడే యువతకు అదే అదునుగా భావించి ఒక్కొక్క కోడిన్ ఫాస్పెట్ కాంబినేషన్ దగ్గు మందు సీసా ను 300 నుండి 500 వరకు అముతున్నట్లు తెలిసింది . అయితే ఆ మెడికల్ షాపు యజమాని ఈ దగ్గు మందు సీసాలు, మత్తు కోసం వాడే నైట్రాజపం మాత్రలను కోదాడలోని మూడు మెడికల్ ఏజన్సీల నుండి తీసుకొచ్చినట్లు అధికారులు గుర్తించారు . ఆ మూడు ఏజన్సీల నుండే ఇతర ప్రాంతాలకు కూడా భారీ స్థాయిలో సరఫరా అయినట్లు సమాచారం. అసలు ఎవరెవరికి సరఫరా అయ్యాయి, ఎంత మొత్తంలో సరఫరా చేశారు అన్న కోణంలో అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు ఇప్పటికే కోదాడ లో ఔషధ నియంత్రణా అధికారులు ఇటీవలి కాలంలో పలు దఫాలు మందుల దుకాణాలపై దాడులు చేసినా కానీ ఏ మాత్రం భయపడకుండా సంపాదనే లక్ష్యంగా ఏదైనా చేసేందుకు కొందరు మందుల దుకాణ యజమానులు ప్రవర్తిస్తుండటం ఆశ్చర్యం . ఇప్పటికైనా అధికారులు సంబంధిత దుకాణదారులపై దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెంటనే బహిరంగపర్చాలి

- నల్లధనం మూలాన్ని దాచి పెట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, ఎస్‌బీఐ ప్రయత్నం
- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి
- ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ధర్నా

నవతెలంగాణ-సూర్యాపేట



ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎస్బీఐ బ్యాంకు వెంటనే బహిరంగపరచాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐసీసీ ,టీపీసీసీ పిలుపుమేరకు ఎలక్టరోల్ బాండ్ల వివరాలను బహిరంగపరచాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.కార్పొరేట్ కంపెనీలు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళల్లో గోప్యతను పాటించే ఎలక్ట్రోల్ బాండ్ల వివరాల్లో ప్రధాని నరేంద్ర మోడీ వేలకోట్ల దుర్వినియోగానికి పాల్పడి నల్లధనాన్ని దాచిపెట్టేందుకు ఎస్బీఐని వాడుకుంటున్నారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా సోనియాగాంధీ ఆర్టీఐ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఎలక్ట్రోల్ బాండ్ లకు ప్రాథమిక లబ్దిదారుగా ఉన్న ఎస్బీఐని కార్పొరేట్ సంస్థల విరాళాలను ప్రజలకు చెప్పాలని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. మార్చి 6 వరకు వివరాలు తెలపాలని ఎస్బిఐని సుప్రీంకోర్టు ఆదేశించగా వివరాలు తెలుపకపోగా మళ్లీ గడువు కోరుతుందన్నారు. ఎలక్ట్రోల్ బాండ్ల ద్వారా వేలకోట్ల విరాళాలు వచ్చాయని దీనిపై కాంగ్రెస్ మొదటి నుంచి కొట్లాడుతుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ జూన్ 30 వరకు ఎస్బిఐ తిరిగి గడువు కోరడం సరికాదన్నారు. సామాన్యుడికి రెండు లక్షలు ఆకౌంట్లో జమ అయితే ఐటీ నోటీసులు ఇచ్చే ఎస్బిఐ వేలకోట్ల అకౌంట్ల వివరాలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మే 30 తర్వాత ఎన్నికలు వస్తాయని అందుకే ఎవరు ఏమి చేయలేరని అనుకుంటున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్బీఐ అధికారులపై చర్యలు తప్పవన్నారు. వెంటనే ఎలక్ట్రోల్ బాండ్ల సమాచారాన్ని బహిర్గత పరచాలని డిమాండ్ చేశారు. మోడీ,ఎస్బిఐ దిగివచ్చే వరకు తమ పోరాటం ఆగదనీ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ,కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకూ ఎలక్షన్ పాసు ఇవ్వాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి టీఎస్‌జేపీ నాయకులు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



రాబోయే లోక్సభ ఎన్నికల నేపథ్యంలో వార్తల కవరేజీ కోసం వర్కింగ్లో ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఎలక్షన్ పాసులు ఇవ్వాలని తెలంగాణ స్టేట్ జనరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు యాదగిరి కోరారు. గురువారం అసోసియేషన్ నాయకులతో కలిసి సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ చిన్న మీడియా పెద్ద మీడియా అని తేడా చూపకుండా ఎలక్షన్ వార్తలు కవర్ చేయడానికి వర్కింగ్లో ఉన్న ప్రతి జర్నలిస్టులకు ఎలక్షన్ పాసులు ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధూపాటి శ్యాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌసుద్దీన్, ప్రచార కార్యదర్శి గట్టి గుండ్ల రాము, సూర్యాపేట నియోజకవర్గం పట్టణ సభ్యులు మామిడి రవి, దేశ గాని వెంకటరమణ పాల్గొన్నారు.

రేపు సీపీఐ(ఎం) విస్తృతస్థాయి సమావేశం

- జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు

నవతెలంగాణ-తుంగతుర్తి



ఈ నెల 9న జరిగే సీపీఐ(ఎం) నియోజకవర్గ స్థాయి విస్తృత సమావే శాన్ని విజయ వంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వమించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 9న తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో నియోజకవర్గస్థాయి సీపీఐ(ఎం) కార్యకర్తల సమావేశం ఉంటుందని ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అనుసరించే విధానాలను చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు పల్లా సుదర్శన్, ఓరుగంటి అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు

నవతెలంగాణ-నూతనకల్

మండల పరిధిలోని చిల్పకుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తుగా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సింగిల్ విండో చైర్మన్ బాణాల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించి సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు అనంతరం తన సొంత ఖర్చులతో ఉపాధ్యాయురాలతో పాటు అంగన్వాడి సిబ్బందిని సాల్వాలతో సన్మానం చేసి పుష్పగుచ్ఛ ఇచ్చి ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాణాల సుదర్శన్ రెడ్డి , పెద్దింటి మోహన్ రెడ్డి బాణాల మల్లారెడ్డి కూసు వెంకన్న ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

నవతెలంగాణ-హుజూర్‌నగర్



సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఎండిఆర్ పాఠశాల ప్రిన్సిపల్ నలబోలు భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం ముందస్తుగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించుకుని ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర గొప్పదని అటువంటి మహిళలను గౌరవించడం సన్మానించడం మనందరి బాధ్యత అన్నారు ఈ కార్యక్రమంలో ఏవో నర్సిరెడ్డి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మూలమలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



నవతెలంగాణ-బొమ్మలరామారం

గ్రామాలలో ఎలాంటి సూచిక బోర్డు లేని మూల మలుపులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మలుపుల వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. దీంతో ఆ గ్రామ మీదిగా వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. బొమ్మలరామారం మండలంలోని రంగాపురం నుండి రామలింగపల్లి, తూముకుంట వెళ్లే మూలమలుపులు చాలా ప్రమాదకరంగా మారాయి. మొన్నటికి మొన్న రామలింగపల్లి గ్రామపంచాయతీ వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో డీసీఎం అదుపుతప్పి ఇంటి గోడను ఢీకొట్టింది. ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో గండం గట్టెక్కింది. అధికారులు ఏలాంటి సూచిక బోర్డు పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఘటనలు కాకుండా చూడాలని ప్రజాప్రతినిధులను, అధికారులను గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఏసీపీని సన్మానించిన శివసేన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ డివిజన్ ఏసిపిగా పదవి బాధ్యతలు తీసుకున్న పటోళ్ల మధుసూదన్ రెడ్డిని తెలంగాణ శివసేన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాతరాజు వెంకటేశ్ పూస శ్రీనివాస్ గురువారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాతరాజు వెంకటేష్ పూస శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో యాదాద్రిభువనగిరి జిల్లాలో పనిచేసి ఉత్తమ పోలీస్ అవార్డును స్వీకరించి, ప్రజల మద్దతు పొందారని అన్నారు.నేడు చౌటుప్పల్ డివిజన్ ఏసిపిగా రావడం ఈ ప్రాంత ప్రజలకు సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తారని వారు అన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో చౌటుప్పల్ మండల శివసేన నాయకులు బి.నాగరాజు, శివకుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



నవతెలంగాణ-భువనగిరి

మహిళలు ఏ రంగంలో కూడా తక్కువ కాదని, వారు అన్ని రంగాల్లోనూ రానిస్తున్నారని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. గురువారం భువనగిరి లింగ బసవ ఫంక్షన్ హాల్ లో మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, సిడిపిఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, వివిధ కార్యాలయాల మహిళా ఉద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చాలా గొప్ప పనిచేశారని, భారత రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు కల్పించారని, ఇది ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ముందు చూపుతో కల్పించిన హక్కు అని అన్నారు. బ్రిటిష్ కాలంలో శ్రీమతి సావిత్రి బా పూలే విశేష కృషి చేసి మహిళలకు పాఠశాలలు ఏర్పాటు చేయడం వలన మహిళలకు మంచి అవకాశాలు వచ్చాయని, ప్రతి రంగంలో మహిళలు ఉన్నారని తెలిపారు. మహిళల భద్రత కోసం బ్రూణ హత్యలకు, లింగనిర్ధారణకు వ్యతిరేక చట్టాలు వచ్చాయని, అలాగే ఫోక్సో చట్టం తదితర అనేక చట్టాలు రక్షణగా ఉన్నాయని తెలిపారు. పురుషునలతో పాటు మహిళలు ఆర్మీలో ఉన్నారని, దేశరక్షణలో పాలుపంచుకుంటున్నారని, విమానయాన రంగంలో విశేషంగా ఉన్నారని, పర్వతారోహణ చేస్తున్నారని తెలిపారు. మన జిల్లాకు చెందిన పర్వతారోహకురాలు అన్వితారెడ్డి గర్వకారణంగా ఉన్నారని, అంతే కాక స్థానిక సంస్థలలో మహిళలు ప్రజాప్రతినిధులుగా విశేస సేవలు అందిస్తున్నారని, నాయకత్వ లక్షణాలు కనబరుస్తున్నారని అన్నారు. మనం పిల్లల్ని పెంచే విధానంలో మహిళల పట్ల గౌరవం పెరిగేలా నేర్పాలని అన్నారు. అని రంగాలలో మహిళలు ఏ రంగంలో కూడా తక్కువ కాదని నిరూపిస్తున్నారని అన్నారు. మహిళల రక్షణ, హక్కులపై, ప్రభుత్వాలు కల్పిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలపై వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ బండారు జయశ్రీ, భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల, రాజపేట ఎంపీపీ గోపగాని బాలమణి, ఆత్మకూరు ఎంపీపీ తండ మంగమ్మ. యాదగిరిగుట్ట జడ్పిటిసి తోటకూర అనురాధ, భువనగిరి జడ్పిటిసి బీరు మల్లయ్య, వలిగొండ జడ్పిటిసి వాకిటి పద్మ, భువనగిరి ఒకటో వార్డు కౌన్సిలర్ ఎల్లమ్మ , 9వ వార్డు నల్ల మాసు సుమ, వైస్ ఎంపీపీ వలిగొండ బాతరాజు ఉమ, ఎన్జీవో డాక్టర్ ప్రమీల, జిల్లా మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సిడిపిఓలు స్వరాజ్యం, జ్యోత్స్న, పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరు నర్సిరెడ్డి



నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టే విధానాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరు నర్సిరెడ్డి కోరారు. గురువారం అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మార్చి 2న నిర్వహించిన ఐసిడిఎస్ శాఖ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పోషకాహారం దుర్వినియోగం అవుతుందని అలా కాకుండా ఉండాలంటే అంగన్వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని అధికారులు ఆదేశించడం సరికాదన్నారు. అంగన్వాడీ టీచర్ల, హెల్పర్లను దొంగలుగా ఆరోపించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 40 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు,హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోకుండా సీసీ కెమెరాలు బయోమెట్రిక్ విధానం పెట్టాలన్న ఇంతవరకు సభభన్నారు. నేటికీ 60శాతం కేంద్రాలకు పక్కా భవనాలు లేవన్నారు. 90శాతం కేంద్రాలలో బాత్రూములు,మంచినీటి సౌకర్యం, కరెంటు కాంపౌండ్ వాల్స్ లేవన్నారు.10 సంవత్సరాలైనా ఆరోగ్యలక్ష్మి మెస్స్ చార్జీలు పెంచలేదన్నారు. కేంద్రాలలో బీరువాలు, టేబుల్లు,కుర్చీలు లేవన్నారు. అంగన్వాడి కేంద్రాలు సమస్యలకు నిలయంగా ఉన్నాయన్నారు. అంగన్వాడీ టీచర్ల 3వ తరగతి ఆయాలు 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలన్నారు. టీఏ బిల్లులు, ఇంటి అద్దె డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దోడ వనజ టీ మాధవి. ఈసం దేవిక. పశువుల శోభ. ఎస్ పుష్పలత.. కే సరోజ. బి వసంత బి వెంకటమ్మ. శివ లీల, మేకల యాదమ్మ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

గుర్తు తెలియని వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఏడుకొండలు తెలిపారు. ఆలేరు పట్టణంలో బుధవారం రాత్రి దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేస్తూ రైల్వే గేట్ వద్ద ఎస్సై జి వెంకట శ్రీనుతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. చైన్ స్నాచింగ్ దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయ్ ఇతర మాదకద్రవ్యాల గురించి సమాచారం తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనుమానితులు సంచరించినప్పుడు 100కు డయల్ చేయాలని సూచించారు.



ఉత్తమ ఏఎన్ఎంగా రజితకు పురస్కారం

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని మునిపంపుల గ్రామ పీహెచ్‌సీ పరిధిలోని వెల్లంకి సబ్ సెంటర్‌లో ఏఎన్ఎంగా పనిచేస్తున్న కూరెళ్ళ రజితకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి ఏఎన్ఎం అవార్డును గురువారం ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణవేణి, సిడబ్ల్యూసి చైర్మన్ జయశ్రీ జిల్లా కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా మునిపంపుల పీహెచ్‌సి పరిధిలోని ఏఎన్ఎంలు, డిఎం అండ్ హెచ్ఓ, వైద్య సిబ్బంది, వెల్లంకి, సర్నేనిగూడెం గ్రామాల ఆశాలు, అంగన్వాడీలు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.



'గాయత్రి'లో ఘనంగా గ్రాడ్యుయేషన్‌డే


నవతెలంగాణ-వలిగొండ

మండల కేంద్రంలోని గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల సంబంధించిన గ్రాడ్యుయేషన్ డే గురువారం స్థానిక శివ సాయి ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పోరెడ్డి రంగయ్య పాల్గొని మాట్లాడుతూ చదువు అలవాటు పడ్డ కొద్ది జ్ఞానాన్ని పెంచే వ్యసనం చదువు మాత్రమే అని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తవటం నరహరి పాఠశాల యజమానులు మురళీధర్ రెడ్డి యాదిరెడ్డి పాలకూర వెంకటేశం బిక్షపతి రమేష్ రాజు కవిత నవీన్ తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసమస్యలపై ఫ్రీగా దరఖాస్తు చేసుకోవచ్చు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

రైతులకు భూ సమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చుని ధరణి కమిటీ స్పష్టం చేయడంతో గురువారం వాట్సాప్‌లలో పోస్టులు వైరల్ అయ్యాయి. మీ సేవ ద్వారా డబ్బు చెల్లించి ధరణి పోర్టల్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, భూ సమస్యలపై 1 నుంచి 9 వరకు ప్రత్యేకంగా చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 45 లక్షల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని కమిటీ తెలిపింది. పై విషయంపై తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా తమకు ఆదేశాలు అందలేదని తెలిపారు.



వృద్ధాశ్రమ ప్రారంభోత్సవానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ జనగాంలో రూ.14 కోట్ల వ్యయంతో ప్రత్యేకంగా నిర్మించిన మహిళా వృద్ధాప్య ఆశ్రమం(రుద్రమ దేవి మహిళా సొసైటీ) ప్రారంభోత్సవ కార్యక్రమానికి చౌటుప్పల్ మండలం నుంచి గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భారి ఎత్తున తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు చౌటుప్పల్ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి సింగల్ విండో చైర్మన్ చెన్నగోనీ అంజయ్యగౌడ్ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య నాయకులు ఉబ్బు వెంకటయ్య, కాసార్ల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నరసింహా గౌడ్,కొయ్యడ సైదులు, అంతటి బాలరాజు, కామిశెట్టి భాస్కర్, రావుల స్వామి, పందుల రాజేష్, కొండూరు వెంకన్న, తూర్పుంటి రవి, వీరమల్ల సత్తయ్యగౌడ్, రాచకొండ భార్గవ్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భువనగిరికోట రూపురేఖలు మారబోతున్నాయి

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి కోట రూపురేఖలు మారబోతున్నాయని, దశాబ్దపు కల నెరవేరబోతున్నదని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేటు సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కార్యక్రమం క్రింద భువనగిరి కోట మొదటి దశ అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ భువనగిరి కోట అభివృద్ధికి స్వదేశీ దర్శన్ 2.0 క్రింద కేంద్ర ప్రభుత్వం రూ.118 కోట్లు కేటాయిస్తూ మొదటి దశ పనులకు గాను రూ.69 కోట్లు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సాధ్యమైనంత ఎక్కువ అభివృద్ధి పరచి పర్యాటకులను ఆకర్శించడం జరుగుతుందని తెలిపారు. బీబీనగర్ మండలంలోని మహదేవ్ పూర్ దేవాలయం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం క్రింద చేపట్టి అభివృద్ధి చేయాల్సి ఉందని, సంబంధిత మంత్రిత్వశాఖతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ 2.0 పథకం క్రింద దేశంలో 53 పనులకు ఈరోజు వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి ప్రారంభించారని, ఇందులో భువనగిరి కోట అభివృద్ధి పనులు కూడా ఉన్నాయని అన్నారు. అందులో భాగంగా భువనగిరి కోట మొదటి దశ అభివృద్ధి పనులను, ఏమేమి వసతులు కల్పించబడతాయో పవర్పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చూపించడం జరిగిందని, జిల్లాలో యాదగిరిగుట్ట, కొలనుపాక, పోచంపల్లి తదితర పర్యాటక కేంద్రాలు అభివృద్ధి చెందుతూ దేశంలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపు పొందుతాయని, యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, జడ్పిటిసి బీరుమల్లయ్య అనూరాధ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ, కేంద్ర ప్రభుత్వ టూరిజం అసిస్టెంట్ డైరెక్టరు మౌతోశ్ నాస్కర్, రాష్ట్ర టూరిజం జనరల్ మేనేజరు ఎం ఉపేందర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజరు నేత్ర, జిల్లా టూరిజం అధికారి ధనంజనేయులు, జిల్లా అధికారులు, హెరిటేజ్ సిబ్బంది కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, అంజయ్య, పర్యాటకులు, యువత పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-ఆలేరుటౌను

రాచకొండ కమిషనరేట్ పరిధిలో పోలీసు స్టేషన్లలో సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి బుధవారం రాత్రి ఆలేరు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. యాదాద్రి జోన్ పరిధిలోని యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్, యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయం కంట్రోల్ రూమ్, ఆలేరు పోలీస్ స్టేషన్ తనిఖీలు నిర్వహించారు. పోలీస్ రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ప్రజల పట్ల వ్యవహరించాల్సిన బాధ్యతలను గుర్తు చేశారు. పోలీసు సిబ్బంది అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జోన్ డీసీపీ రాజేష్ చంద్ర, ఏసీపీ రమేష్ కుమార్, సిఐ కొండలరావు, ఎస్సై జి వెంకట శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ సత్యం గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత వాయుసేనలో చేరాలి

- వింగ్ కమాండర్ గురుప్రీత్ అథవాల్



నవతెలంగాణ-ఆలేరుటౌన్

అగ్నివీర్ వాయుపథకం ద్వారా యువతీ యువకులు భారత వాయుసేనలో చేరి దేశ సేవలో పాలుపంచుకోవాలని వాయు సేన వింగ్ కమాండర్ గురుప్రీత్ అథవాల్ పిలుపునిచ్చారు. ఆలేరు పట్టణంలో గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అగ్నివీర్ వాయు పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన 17 సంవత్సరాల 6నెలల వయస్సు నుండి 21 సంవత్సరాలలోపు ఉన్న యువతీ యువకులు జూన్, జూలై నెలలో వచ్చే నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, మూడు దశలలో జరిగే ఎంపిక పరీక్షలలో ఉత్తీర్ణులు కావాలని, తద్వారా వాయుసేనలో చేరడానికి అర్హులు అవుతారని పేర్కొన్నారు. వాయు సేనలో చేరిన యువతీ యువకులు 4సంవత్సరాల పాటు తప్పని సరిగా సేవ చేయవలసి ఉంటుందని చెప్పారు. ప్రతి నెల రూ.30 వేల నుండి రూ.40 వేల వరకు వేతనంతో పాటు, భోజన వసతితో కూడిన అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. సార్వత్రిక విద్య ద్వారా ఉన్నత విద్యను పూర్తి చేయవచ్చని తెలిపారు. 4సంవత్సరాల సమయంలో కనబర్చిన పనితీరు, ప్రతిభ ద్వారా 25 శాతం యువతీ యువకులను వాయు సేనలోకి పూర్తి స్థాయి ఉద్యోగులుగా తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. 4 సంవత్సరాల అనంతరం సేనలో ఎంపిక కాక పోయినా, కొనసాగే ఇష్టం లేకపోయినా ప్రభుత్వ రంగ సంస్థల్లో మరియు కార్పొరేట్ కంపెనీలలో చేరే అవకాశం ఉందని అన్నారు. సేవానిధి ద్వారా సుమారు రూ.11 లక్షల 50వేల నగదు, 48 లక్షల జీవిత భీమా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాయు సేన నాన్ కమిషన్డ్ అధికారి సందీప్, యాదాద్రి భువనగిరి జిల్లా సీఎంఓ పెసరు లింగా రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జయపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం కాదు.. దేవాలయం

- ప్రభుత్వవిప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ నిర్మించిన మహిళ వృద్ధాశ్రమం వృద్ధాశ్రమం కాదని వృద్ధదేవాలయమని రాష్ట్ర ప్రభుత్వవిప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం జనగామ పట్టణ సమీపంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ వారు నిర్మించిన మహిళా వృద్ధాశ్రమం భవనం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర స్త్రీశిశు శాఖ మంత్రి సీతక్క, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డితో కలసి బీర్ల ఐలయ్య రిబ్బన్ కట్ చేసి వృద్ధాశ్రమం ప్రారంభించారు. ఈ ఆశ్రమంలో బ్లాక్ ఏ ను బీర్ల ఐలయ్య ప్రారంభించారు. అనంతరం స్వర్గీయ కోమటిరెడ్డి సుశీలమ్మ విగ్రహన్నీ ఆవిష్కరించారు. బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఎంతోమంది డబ్బులు ఉన్న వాళ్లను చూసాం కానీ పేద ప్రజల కోసం మేమున్నాం అని, వృద్ధ సమయంలో ఒక కొడుకుగా నేనున్నాను అని రాజగోపాల్ రెడ్డి ఎంతో పెద్ద మనసుతో 150 మందికి కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలులతో 17 కోట్లతో నిర్మించారని అన్నారు. పేద ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉందన్నారు.

రావి నారాయణ రెడ్డి కాంస్య విగ్రహ నమూనా పరిశీలన



నవతెలంగాణ-భువనగిరిరూరల్

రావి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కాంస్య విగ్రహాన్ని ఆయన సొంతూరు బొల్లేపల్లిలో ఏర్పాటు చేయడానికి రానారె సంస్థ మరో ముందడుగు వేసింది. గురువారం హైదరాబాదులో ఉన్న ఒక ప్రముఖ కాంస్య విగ్రహాల తయారీ యూనిట్ సంస్థ సభ్యులు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను, ఇంతకు ముందు చేసిన వారితో ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, లోహాలు మిశ్రమాలు, నాణ్యత, జీవిత కాలం, ఎత్తు, బరువు, వీరు చేసిన ట్యాంక్ బండ్ మీద విగ్రహాలు, జనగాంలో ప్రతిష్టించ బోతున్న అతి పెద్ద బమ్మెర పోతన విగ్రహం లాంటి వివిధ విషయాల మీద కూలంకషంగా చర్చించారు. ఈ సంస్థ ప్రతినిధులు చెరుకుపల్లి శ్రీనివాసు అధ్యక్షులు, రావి సుకేష్ రెడ్డి కార్యదర్శి, తిరుమణిదాసు వేంకటేశ్వర్లు కోశాధికారి ఉన్నారు.

పాఠశాలలో మాక్ అసెంబ్లీ



నవతెలంగాణ-భువనగిరిరూరల్

మండలంలోని అనంతారం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలలో గవర్నర్, స్పీకర్, అధికార, ప్రతిపక్ష నాయకుల పాత్ర ఏ విధంగా ఉంటుందో విద్యార్థులు చక్కగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సబిత , ఉపాధ్యాయులు శోభారాణి, పి కృష్ణమూర్తి, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ కృష్ణవేణి, గ్రామస్థులు, తల్లిదండ్రులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

ఎలిమినేటి మాధవరెడ్డి వర్ధంతి



నవతెలంగాణ-రామన్నపేట

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హోంశాఖ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి 24వ వర్ధంతిని గురువారం మండలంలోని వెల్లంకిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు తాళ్లపల్లి సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు పోచబోయిన నర్సింహా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి నకిరేకంటి గణేష్, మండల తెలుగు యువత నాయకులు పోచబోయిన మల్లేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి నిమ్మల మధు, రవీందర్, రాజు, మహేందర్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ గౌడ్, ఉపేందర్ చారి, దేవేందర్, అంజిరెడ్డి, లచ్చయ్య పాల్గొన్నారు.



వలిగొండరూరల్: ఎలిమినేటి మాధవరెడ్డి వర్ధంతి సందర్భముగా మండలంలోని సంగెంలో గురువారం మాధవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాసుల కృష్ణ, కీసరి రాంరెడ్డి, తాడూరు యాదగిరి, చంద్రారెడ్డి, జక్కుల వెంకటేష్, మల్లారెడ్డి, గంగి రెడ్డి, రంగారెడ్డి, వెంకటేష్, లింగా రెడ్డి, లింగ స్వామీ పాల్గొన్నారు.

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎలిమినేటి మాధవరెడ్డి వర్ధంతిని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎండి హన్నుబాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని మాధవరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సిలువేరు నరసింహ, గుమ్మడి అంజిరెడ్డి, నల్ల పర్వతాలు యాదవ్, మారగోని అశోక్ గౌడ్, బొమ్మిరెడ్డి మల్లారెడ్డి, తడక కోటేశ్వర్, వహీద్, ఎడ్ల రామ్ రెడ్డి, సుంకరి జంగయ్య గౌడ్, బిక్షపతి, గోశిక పాండు, గంగాపురం దశరథ, ఆకుల మధు, బొల్లేపల్లి వెంకటేశం, దూడల జంగయ్య, ఎస్ డి ని సార్, గణేష్, ఉపేంద్ర చారి, భూపాల్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: ఎలిమినేటి మాధవరెడ్డి వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు, యువసేన రాష్ట్ర కన్వీనర్ ముత్యాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తగూడెం, దేశ్ముఖి, పద్మనగర్, పోచంపల్లి మాధవరెడ్డి చౌరస్తా వద్ద మాధవరెడ్డి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



భువనగిరిరూరల్ : మండలంలోని వడపర్తిలో దివంగతనేత మాజీ మంత్రి ఎలిమినేటి మాధవ రెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా వారి ఘాట్ వద్ద పూలమాలతో నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో జిల్లా ప్రజాపరిషత్ చైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ మంత్రి ఎలిమినేటి ఉమా మాధవ రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎడ్ల రాజేందర్ రెడ్డి, మాజీ పిఏసిఎస్ ఎడ్ల సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు చెరుకు శివయ్య గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, ఇక్బాల్ చౌదరి, డోప్ప వెంకటేష్, యాట కుమార్, బచ్చు వెంకట్, మోహిన్, సుధాకర్ నాయక్, గోపి నాయక్, మహేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమాన అవకాశాలతోనే మహిళా సాధికారత

• అరోరా లీగల్ సైన్స్ లా కళాశాల ప్రిన్సిపాల్ నక్క యాదగిరి



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు కల్పించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అరోరా లీగల్ సైన్స్ లా కళాశాల ప్రిన్సిపాల్ నక్క యాదగిరి పేర్కొన్నారు. గురువారం ఆ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు యాదగిరి గౌడ్, నారాయణరావు, ధనలక్ష్మి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మహబూబ్, విద్యార్థులు ఎండి సాదత్ అలి, శశాంక్, చంద్రహాస్ పాల్గొన్నారు.

అంగన్వాడీలు సమగ్రంగా కుటుంబ సర్వే చేయాలి :సీడీపీఓ

నవతెలంగాణ-మిర్యాలగూడ

అంగన్వాడీలు సమగ్రంగా కుటుంబ సర్వే చేయాలని సీడీపీఓ మమత కోరారు. గురువారం స్థానికంగా మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు ప్రాజెక్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన వార్షిక కుటుంబ సర్వే గురించి,ఇంతకుముందు రికార్డులలో సర్వే నిర్వహించగా,ఇప్పుడు ఆన్లైన్‌లో ఎన్హెచ్టిఎస్ యాప్ నందు డేటా పొందుపరచవలసి ఉన్నదని,ఆ యాప్ గురించి శిక్షణ ఇచ్చారు. గ్రోత్ మానిటరింగ్, పిల్లల బరువులు, ఎత్తులు తీయువిధానం, లోప పోషణ, తీవ్ర లోపపోషణ పిల్లలను గుర్తించుట అవగాహన కల్పించారు. అదేవిధంగా బరువులు గుర్తించుటకు కొత్తగా డిజిటల్ వెయింగ్ పరికరాలను ఇచ్చారు. ఈసీసీఈ సంసిద్ధ యాప్‌లో (పిల్లల యొక్క అభ్యసన పర్యవేక్షణ) శిక్షణ నిచ్చారు. నల్గొండ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సతీష్ ఎన్‌హెచ్‌టిఎస్ ఫ్యామిలి సర్వే, యాప్, పోషన్ ట్రాకర్ యాప్ లకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్లు రేవతి, మాధవి, నజీమా బేగం, పద్మ, రాధిక, లీల కుమారి, కవిత(పోషన్ అభియాన్ బీసీ),అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నెర్రలుబారుతున్న పొలాలు

• ఎండి పోయిన పెద్దవాగు, చెరువులు
• బోర్లలో నీళ్లు రాక రైతులు విలవిల
• దిక్కుతోచని స్థితిలో అన్న దాతలు
• డిస్ట్రిబ్యూటరీ,ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలని వినతి

నవతెలంగాణ-పెద్దవూర

సాగు నీరందక పొలాలు నెర్రెలుబారుతున్నాయి బోరుబావులపై ఆధారపడి వరి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వేసవి ప్రారంభం నుంచే ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు అండుగంటి పోతున్నాయి. దీంతో వరి పంట వేసిన రైతులు సాగు నీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఎండలు క్రమ క్రమంగా ముదురుతున్నాయి.



పెద్దవూర మండలం అంతా మెట్ట ప్రాంతమే వరద కాలువ,ఏఎంఆర్ పీ కాలువల ద్వారానే సాగు చేస్తున్నారు.కానీ సాగర్ జలాశయం డెడ్ డెడ్ స్టరేజీకి చేరింది. దీంతో నీటి విడుదల చేయక చేలు అన్ని బీళుగా మారాయి. డిస్ట్రిబ్యూటరీ కాలువలకు నీటిని విడుదల చేస్తారని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. వరి పొలాలు నేర్రెలు వారి ఎండి పోతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్లలో నీళ్లరాక సాగు చేసిన పొలాలు కండ్ల ముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరవతున్నారు.

బోరు బావులకింద సాగు

మెట్ట ప్రాంతం కావడం,భూగర్భ జలాలు చాలా అడుగంటడంతో ఎక్కువ శాతం బోరుబావుల కింద పంటలను సాగు చేయగా, సరిగ్గా నీరందించలేకపోవడంతో వరి చేలు ఎండుముఖం పడుతున్నాయి. ఆరుగాలం శ్రమంతా వృథా అవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంట పండించడం కష్టమే అని రైతులు పేర్కొంటున్నారు.. వర్షాకాలం సీజన్‌లో వర్షాలు కురవక సాగర్ ప్రాజెక్టు లోకి వరదలు రాక చెరువులు, కుంటలు కూడా పూర్తిగా ఎండి పోయాయి. అనా వృష్టి తో కొన్ని ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లి చేతికి రాకుండా నేలపాలైంది. మార్చి మొదటివారం నుంచే ఎండలు తీవ్రరూపం దాల్చడంతో వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయి. బోర్లు నీరు ఇంకిపోతున్నయి. దీంతో వరికి సరిపడా నీరందించలేక రైతులు అల్లాడుతున్నారు. పంటను దక్కించుకోవాలన్న తపనతో కొందరు వ్యవసాయ బావుల్లో పూడికతీతను చేపట్టారు. మరికొందరు అప్పు చేసి బోర్లు వేయిస్తున్నారు. అయినా చుక్కనీరు పడకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చేసేదేమీ లేక నెర్రెలువారిన చేనులో పశువులను మేపుతున్నారు.కొంతమంది రైతులు. నీరు లేక చాలా చోట్ల పొట్ట దశలో వరి మాడిపోతున్నాయి.

మండలంలో 752.65 హెక్టార్లలో వరి సాగు

మండలంలో వెల్మగూడెం, పెద్దవూర చెరువులకింద 96 హేక్టర్లు,బసిరెడ్డి చెరువుకింద 34, సంగారం చెరువు కింద 91, తెప్పల మడుగు చెరువు కింద15 చింతపల్లి 35, పర్వేదుల చెరువు కింద 22, అదేవిదంగా చలకుర్తి ఎత్తిపోతలకింద 90, నాయినవాని కుంట, తుంగతుర్తి చెరువులకింద 42, హేక్టర్లు లలో వరి సాగు చేశారు. మండలం లో పెద్దవూర, పోతునూరు శిరసనగండ్ల చెరువులు మాత్రమే కొద్ది పాటి నీళ్లు ఉన్నాయి. మిగితా చెరువుల్లో చుక్క నీళ్లు లేవు.పెద్దవూర పెద్ద వాగు పూర్తిగా ఎండిపోయి వెలవెల బోయింది. వేల ఎకరాలలో వరి సాగుచేయగా ఇప్పటికే చాలా వరకు పొలాలు నీళ్ల లేక ఎండి పోతున్నాయి. పంటలకు మంచి తరుణం లో బోర్లలో పూర్తిగా నీరు ఇంకిపోవడంతో సాగుచేసిన పంటల్లో సగానికిపై ఎండిపోయే ప్రమాదం వుంది. ఫలితంగా రైతులకు పెట్టుబడి సైతం చేతికందని పరిస్థితి నెలకొంది.దాంతో పర్వేదుల, చలకుర్తి, కొతలూరు, ఇంకా చాలా గ్రామాల్లో పొలాలు ఎండి పోవడం తో చేసేది లేక పశువులను మేపుతున్నారు.జనవరి నుంచే నీటి గండం మొదలైందని. ఇంకా కనీసం 30 రోజులైనా గడిస్తే కొంత పంట చేతికి వస్తుందన్న ఆశ తప్ప వేరే ఆధారం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.సాగు చేసిన పొలాలు పండాలంటే డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని, అలాగే ఎడమ కాలువకు వారం రోజులపాటు నీళ్ల విడుదల చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

ఎడమ కాలువకు నీళ్లు విడుదల చేసి పంట పొలాలు కాపాడాలి

రైతు దండ సుధాకర్ రెడ్డి

పంట పొలాలకు సాగునీరు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు రైతులు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. సాగునీటి కోసం వ్యవసాయ భూమిలో నాలుగు బోర్లు వేస్తే చుక్కనీరు కూడ పడడంలేదు. మూడు ఎకరాలు వరిసాగు చేశాను. రెండు ఎకరాలు నీళ్ల లేక నేర్రెలు వారాయి. దాంతో చేసేదేమీలేక బర్లను మేపుతున్నాను. సాగునీటి కోసం ప్రభుత్వం ఏఎంఆర్ డిస్ట్రిబ్యూటరీ, వరద కాలువలకు నీళ్ల విడుదల చేసి చెరువులు నింపి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాము.



ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేయాలి

• మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-దేవరకొండ

ప్రజల నుంచి ఎలాంటి ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేయాలని బీఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.గురువారం దేవరకొండ పట్టణంలో ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే మాట మార్చిన కాంగ్రెస్ నాయకులు అన్నారు . ఎల్ ఆర్ఎస్ పేరిట 25 లక్షల మంది దరఖాస్తుదారుల నుంచి రూ.20 వేల కోట్ల వరకు వారి రక్త మాంసాలను పీల్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఆర్ఎస్ వద్దు అంటూ మాట్లాడిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎందుకు మౌనం వహించారో ప్రజలకు చెప్పాలి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెలుగురి వల్లపు రెడ్డి,వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్,బోయపల్లి శ్రీనివాస్ గౌడ్,ముక్కమల్ల బాలయ్య,తోటకురి పరమేష్,రమావత్ మోహన్ కృష్ణ,వేముల రాజు,బొడ్డుపల్లి కృష్ణ,జర్పుల లోక్య నాయక్, ఎర్ర యాదగిరి,రమావత్ తూలిసిరాం,జయప్రకాష్ నారాయణ, ఇలియస్, నల్లగసు సత్యనారాయణ, వాడిత్య బాలు, బాబా, గుదేటి సత్యం,వెంకటయ్య, చారి,శంకర్ నాయక్, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వేచ్ఛ, సమానత్వం కోసం ఉద్యమించాలి

• ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ

నవతెలంగాణ-చౌటుప్పల్



మహిళలు స్వేచ్ఛ, సమానత్వం కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ తెలిపారు. గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు అనురాధ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని తెలిపారు. శ్రమ చేసే మహిళలను గౌరవించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హక్కులు మానవ హక్కులలో భాగమే కానీ బీజేపీ ప్రభుత్వం మహిళల హక్కులను హరిస్తున్నదన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, హింసలో బాగా పెరిగాయన్నారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. నేరస్తులను కఠినంగా శిక్షించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో నిరుద్యోగంతో బాధలు పడుతుంటే బిజెపి ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఆమె విమర్శించారు. మహిళలు దేశంలో అభద్రతతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. మతోన్మాద మనువాదం చెలరేగిపోతుందన్నారు. మహిళలు సంఘటితమై ప్రతిఘటించాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళలు చైతన్యమవుతూ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డు కౌన్సిలర్ దండ హిమబిందు అరుణ్ కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు దొడ్ల అండాలు, ఐద్వా నాయకురాలు బత్తుల వరలక్ష్మి, రాణి, లలిత, భాగ్యమ్మ, గీత, రూప, రమాదేవి, భారతమ్మ, జ్యోతి, పాల్గొన్నారు.

పోచంపల్లిలో ఐఐహెచ్‌టీని ఏర్పాటు చేయాలి

• సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

భూదాన్‌పోచంపల్లి, చేనేతకు ప్రసిద్ధిగాంచిన జిల్లాలోనే అత్యధికంగా చేనేత కార్మికులు ఇక్కత్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నందువలన కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన చేనేత ఇనిస్టూట్ ఇండియన్ ఇన్స్టిట్యూట్‌ఆఫ హ్యాండ్లూమ్ టెక్నాలజీఐ. ఐఐహెచ్‌టీనీ పోచంపల్లిలో ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ఏఎంఆర్ భవన్ వద్ద సీపీఐ మండల కార్యదర్శి గోడల నాగభూషణ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి జిల్లా కార్యదర్శి శ్రీరాములు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో గీత పని వారల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు యాదయ్య గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి గోడల నాగభూషణ్ గౌడ్, మాజీ కార్యదర్శి భీమగొని నరసింహ గౌడ్, పట్టణ కార్యదర్శి మిర్యాల కృష్ణమూర్తి, కౌన్సిల్ సభ్యులు ముసునూరి రాములు, సంఘం గణేష్, బాల్ నరసింహ, శ్రీశైలం, వంగరి నరసింహ, యాదగిరి, బాలయ్య,తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మహిళా శక్తికి ఎల్లవేళలా ప్రోత్సాహం



• సుశీల్ కుమార్ సింగ్

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

మహిళలకు తగు అవకాశాలు కల్పించడంతో పాటు, వారి శక్తి సామర్థ్యాలను ప్రోత్సహించడం లో భారత ఆహార సంస్థ ఎల్లపుడూ ముందంజ లో ఉంటుందని భారత ఆహార సంస్థ నల్గొండ జిల్లా డివిజనల్ మేనేజర్ సుశీల్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన మహిళా దినోత్సవ ముందస్తు వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, మన సమాజంలో మహిళలు నిరంతరం శ్రమిస్తూ దేశాభివృద్ధిలో విశేష పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. ఇటీవల నిర్వహించిన రిక్రూట్మెంట్ ద్వారా, పెద్ద ఎత్తున మహిళా అభ్యర్థులు తమ సంస్థ లో చేరడం శుభ పరిణామమన్న ఆయన వారు భవిష్యత్తులో మరింతగా రాణించాలని అభిలషించారు. అదే విధంగా, మహిళా ఉద్యోగులు, వారి చిన్నారుల సంరక్షణకు తెలంగాణా ప్రాంత ఎఫ్సీఐ లో మొట్టమొదటిగా నల్గొండ జిల్లా కార్యాలయం లో శిశు విహార్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం సంస్థ ఏటీఎం (క్యూ సి) రాతిష్ చంద్రన్ మాట్లాడుతూ, ఎఫ్సీఐ లో లింగ వివక్ష కు తావు లేకుండా సమానత్వాన్ని ప్రోత్సహిస్తామని అన్నారు. తమ విజ్ఞప్తిని మన్నించి ఈ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించుకునే విధంగా తగినన్ని నిధులు మంజూరు చేసిన సంస్థ తెలంగాణా ప్రాంత జనరల్ మేనేజర్ జి ఎస్. రాజు కు మహిళా ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగినులు కృష్ణవేణి, ఆశ, దివ్య, ప్రసన్న లక్ష్మి, సుప్రియ బి కే ఎస్ కే యూనియన్ ప్రతినిధులు సతీష్ రెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని జాతీయ రహదారి 65పై గోపులాయపల్లి వేణుగోపాల స్వామి దేవస్థానం ఆర్చి వద్ద చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై అంతి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ..ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఐత రాజు ముత్తిలింగం (70) ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. దీంతో ముత్తి లింగం అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



గైడ్ లైన్స్ ప్రకారం పోలీస్ అధికారులు సిద్ధంగా ఉండాలి

• ఎస్పీ చందనా దీప్తి

నవతెలంగాణ- నల్లగొండ టౌన్

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ గైడ్ లైన్స్ ప్రకారం సిద్ధంగా ఉండాలని, ఎన్నికల నియమావళిని తుచా తప్పకుండా పాటించి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ చందనా దీప్తి పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పై డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అధికారులు అందరూ ఎన్నికల సంఘం నియంత్రణ,పర్యవేక్షణ , క్రమశిక్షణకు లోబడి పని చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ అధికారి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు తమ విధులు నిర్వర్తించాలని తెలిపారు.ఎలక్షన్స్ సమయంలో పోలీసు అధికారులు ఎలక్షన్ ముందు, ఎలక్షన్ రోజు, ఎలక్షన్ తర్వాత, తీసుకోవలసిన చర్యల గురించి క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని, ఎలక్షన్స్ సందర్భంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ టి.పరమేష్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పై అధికారులకు కోడ్ అమలులోకి రాగానే పోలీసు అధికారులు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలు, బాధ్యతలు, చేపట్టవలసిన చర్యలపై అధికారులకు పూర్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బి.రాములు నాయక్, ఎస్‌బీ డిఎస్పీ జి.రమేష్,నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, దేవరకొండ డిఎస్పీ గిరి బాబు, మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు, డీసీఆర్‌బీ డిఎస్పీ సైదా, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ టి.పరమేష్, సీఐ లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలి

• సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ .లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-నాంపల్లి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నది కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలని ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ . లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారంమండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా కార్మిక సమస్యల పరిష్కారానికి తగినంత శ్రద్ధ కనబరచడం లేదని అన్నారు. ఇప్పటికీ ఆశ అంగన్వాడీ గ్రామపంచాయతీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రావడం లేదని ఆర్టీసీ లాంటి సంస్థల్లో ఉద్యోగులు తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమల్లో కోటి 20 లక్షల మంది కార్మికులు ఉన్నారని వారికి కనీస వేతనాలు అమలు చేయడంలో గత ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి కార్మిక వర్గం కర్రు కాల్చి వాత పెట్టిందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా షెడ్యూల్ పరిశ్రమల్లో వేతనాలు సవరిస్తూ కనీస వేతనాలకనుగుణంగా లేవని అతి తక్కువ వేతనాలు నిర్ణయించారని వీటిని సవరించి కనీస వేతనం 26,000 నిర్ణయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు నాంపల్లి నరేష్, ఆశ వర్కర్స్ యూనియన్ మండల ఉపాధ్యక్షురాలు ఎదుళ్ళ కవిత, కోరే లలిత, ఎదుళ్ళ సునీత, మరియమ్మ ఈరమ్మ సులోచన, పార్వతమ్మ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్‌ఎంకు వెయ్యి కోట్లు కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి

• ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



నేషనల్ హెల్త్ మిషన్ కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్లో తెలంగాణకు రావలసిన 1000 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేసి మూడు నెలల బకాయిలుగా పడి ఉన్న ఎన్‌ఎచ్‌ఎం ఉద్యోగుల జీతాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐటియుసి సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్న నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేసే ఆల్ క్యాడర్స్, రెండవ ఏఎన్‌ఎం లు, ఆర్ బిఎస్ కే సిబ్బంది తో పాటు మొత్తం 17,000 మంది ఉద్యోగుల జీతాలను విడుదల చేయాలన్నారు.గత ప్రభుత్వ కాలంలో ఎన్ హెచ్ ఎం వ్యవస్థను నాశనం చేశారని మండిపడ్డారు. ప్రతినెల 1వ తేదీన జీతాలు చెల్లించటానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్ రెండవ ఏఎన్‌ఎం జిల్లా కార్యదర్శి స్వప్న జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాధా సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు యూనియన్ నాయకురాలు నీరజ శైలజ ఉమా చంద్రకళ గీత సరిత జయసుధ ఆల్ క్యాడర్ యూనియన్ నాయకురాలు సంధ్య సైదాచారి మహేష్. తదితరులు పాల్గొన్నారు.

ఆడ, మగ మధ్య ఉండాల్సింది పోటీ కాదు ప్రోత్సాహకం



• ప్రముఖ నటి, ఇండిఫేమ్ సీఈఓ దాస్యం గీతా భాస్కర్

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

ఆడ, మగ మధ్య ఉండవలసినది హక్కుల కోసం పోరాటం కాదు. అవగాహతో కూడిన ప్రోత్సాహకం. స్త్రీలు పరిస్థితులకు బయపడక జీవితాన్ని ఒక లక్ష్యం తో తీర్చిదిద్దుకోవాలని ప్రముఖ నటి, ఇండిఫేమ్ సీఈఓ దాస్యం గీతా భాస్కర్ అన్నారు. గురువారం స్థానిక ఎన్జీ కళాశాలలో, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ఎస్పీచందనా దీప్తి మాట్లాడుతూ ఆడవారు ఆర్థికంగా స్వతంత్రత కలిగిఉండాలని, ఇటు కుటుంబ పాలన అటు కెరియర్ రెండింటిని సమర్థవంతంగా నిర్వర్తించడంలో ఆడవారికి మాత్రమే మనోధైర్యం ఎక్కువ అని అభివర్ణించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాలలో దూసుకు పోవాలని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ఆటల పోటీలు ఇతర కల్చరల్ పోటీలలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథి, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సమూద్రాల ఉపేందర్, కన్వీనర్ గా డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి వ్యవహరించగాఈ కార్యక్రమంలో లైబ్రరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాప్రసాద్,ఫిజికల్ డైరెక్టర్ మల్లేశం, డాక్టర్ దీపిక,సి.శివరాణి,శిరీష, సావిత్రి, సరిత.మహేశ్వరి.సంధ్యా,శ్వేత, కవిత,రజని, అష్రఫ్, యాదగిరి రెడ్డి,సుధాకర్,వేణు తదితరులు పాల్గొన్నారు.

మహిళల శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలి

• పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి

నవతెలంగాణ-నల్లగొండటౌన్



మహిళల శ్రమకు తగిన గుర్తింపునిస్తూ పని ప్రదేశాలలో రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం అన్నారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్లో సీఐటీయూ నలగొండ పట్టణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సెమినార్ లో ఆయన మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేటు సంస్థల ప్రయోజనాల కోసం మతోన్మాద విధానాలను వేగవంతం చేస్తుందని అన్నారు శ్రమను శ్రమ చేసే మహిళలను గౌరవించడం లేదని మహిళలకు మానవ హక్కుల లో భాగమే కానీ బిజెపి ప్రభుత్వం మహిళా మహిళల హక్కులను హరించి వేస్తుందని ఆరోపించారు. దేశంలో నిత్యం మహిళలపై హత్యలు , లైంగిక దాడుదలు జరుగుతున్నా యన్నారు. మహిళా సాధికారత గురించి గొప్పలు చెబుతున్న ప్రభుత్వం మహిళలకు 33 పర్సెంట్ రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, వివిధ సంఘాల నాయకులు కొత్తపల్లి అనసూర్య, గంధంమల్ల యాదమ్మ, పాలడుగు వెంకటేశం, పందుల లింగయ్య గంధ మల్ల సునీత నాగయ్య శ్రావణ్ ఇందిరా పార్వతమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



• ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండటౌన్

నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో పనిచేస్తున్న2వ ఏఎన్‌ఎం ఇతర ఉద్యోగులందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని అలాగే పెండింగులో ఉన్న 3నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డి ఎం హెచ్ ఓ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ అందించడంలో ఎన్‌హెచ్‌ఎం స్కీం లో పనిచేస్తున్న ఉద్యోగులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం వీరిని శ్రమదోపిడికి గురిచేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం డిఎంహెచ్వో కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కత్తుల రవికుమార్, డాక్టర్ సైదయ్య ,గీతా రాణి అన్నపూర్ణ సరిత అరుణ మేరీ హైమావతి సునీత సైదమ్మ సుజాత గీత జ్యోతి, అండాలు, విజయలక్ష్మి, మల్లేశ్వరి, ఉపేంద్ర, కల్పన, కరునశ్రీ,వెంకటరమణ,అనిత, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు నీటి ట్యాంకర్లు



నవతెలంగాణ-మిర్యాలగూడ

మున్సిపాలిటీ పరిధిలో నీటి కొరత తీర్చేందుకు అవసరం ఉన్న చోటికి ట్యాంకర్లతో నీటి సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తెలిపారు. నీటిఎద్దడి నివారణకు గురువారం మున్సిపల్ పాలకవర్గ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వేసవి కాలం పూర్తయ్యే వరకు ఆవాస కాలనీల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా ట్రాక్టర్ ట్యాంకర్ల సాయంతో నీటి సరఫరా చేయనున్నట్లు తీర్మానించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ నాగలక్ష్మీ భార్గవ్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, శేఖర్ రెడ్డి, జావేద్, ఉదయ్ భాస్కర్, దుర్గా, జయలక్ష్మీ సాదేఖా బేగం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైయినేజ్ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-నేరేడుచర్ల



మండలంలోని మేడారం గ్రామంలో 15 లక్షలతో సీసీ రోడు, డ్రైయినేజ్ పనులకు జెడ్పీటీసీ రాపోలు నరసయ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ నీటిపారుదల శాఖ ,పౌరసరపరాల శాఖ మంత్రివర్యులు కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.15 లక్షలతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొనతం చిన్న వెంకటరెడ్డి ,మున్సిపల్ చైర్మెన్ బచ్చలకూరి ప్రకాష్ , కట్ట రామారావు, కట్టా కృష్ణయ్య కుంజేటి జ్యోతి బాబు, డీలర్ పాండయ్య, రాకేష్, పారేపల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మల్లయ్య, నరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్ణం యాదగిరి, మామిడి వెంకటయ్య, రాజీవ్, సత్యనారాయణ, డాక్టర్ భుజంగరావు, ముక్కంటి నాగేశ్వరరావు, బాలకృష్ణ, కెమెరామెన్ ఆర్యే పాల్గొన్నారు.

నేడే మహా శివరాత్రి



● విద్యుత్ కాంతులతో ముస్తాబైన శివాలయాలు

నవతెలంగాణ-నల్లగొండటౌన్

ఈ నెల 8న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో శివాలయాలు ముస్తాబయ్యాయి. దేవాలయ పాలకమండలి సభ్యులు విద్యుత్ కాంతులతో దేవాలయాలకు అందంగా అలంకరించారు. జిల్లా కేంద్రంలోని పానగల్లులో నెలకొన్న పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వర ఆలయం విద్యుత్ కాంతులతో ఆలంకరించారు. శివ రాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా దేవస్థాన సభ్యులు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

పచ్చల సోమేశ్వరాలయం విశిష్టత...

11-12వ శతాబ్దంలో కుందూరు చోళులు రాజుల రాజధానిగా ఉండేది. ఇక్కడ కాకతీయులకు సామంతులైన కుందూరు చోళులు పచ్చల సోమేశ్వర ఆలయా సముదాన్ని నిర్మించారు .ఆలయం లోపల నంది చుట్టూ నాలుగు స్తంభాల మీద రామాయణ మహా భారతం, భాగవతం గాథలు చెక్క బడి ఉన్నాయి. స్వామివారి కింద పచ్చలుపొదగబడి ఉండటం వల్ల ఈ దేవాలయానికి పచ్చల సోమేశ్వరాలయం నామకరణం జరిగింది.

ఛాయా సోమేశ్వర ఆలయం ప్రత్యేకత..

అతి ప్రాచీనమైన భారతదేశ చరిత్ర తెలిపే సాక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. వందల ఏళ్ల పాలించిన రాజులు వైభవాన్ని తెలిపే విశిష్టమైన నిర్మాణాలు దేశంలోని ప్రతిమూలలో వున్నాయి. అధునాతన టెక్నాలజీతో అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన కట్టడాలు నేటి ఇంజినీర్లకు ఇప్పటికీ సవాలుగా విసురుతూనే ఉన్నాయి. అలాంటి ఆలయాలలో ప్రసిద్ధి చెందినది ఛాయా సోమేశ్వర ఆలయం.నల్లగొండ పట్టణంలోని ఈ దేవాలయంలో ఎల్లవేళలా ధ్వజస్తంభం నీడ దేవుడి పై పడుతూ ఉంటుంది. ఛాయా సోమేశ్వర ఆలయం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి కెక్కింది. ఈ ఆలయంలో ప్రపంచంలో ఎక్కడా కనిపించని విశేషం గర్భాలయంలోని నీడ (ఛాయ)కప్పేయడం. ఈ ఆలయానికి ముఖ ద్వారం ముందు రెండు స్తంభాలుంటాయి. వాటి ద్వారా అన్ని వేళలా ఒకే నీడ పడుతుంది. వెలుతురు ఉన్నంతసేపూ ఆ నీడ కదలకుండా ఒకే స్థానంలో ఉండటం ఈ ఆలయం ప్రత్యేకత. మరో చిత్రమైన విషయం ఏమిటంటే ఆ నీడ ఏ వస్తువుదనే విషయం అంతు చిక్కదు.

సహకారంతో దేవాలయం అభివృద్ధి : గంట్ల అనంతరెడ్డి

ఓజో అగ్రికెర్ సహకా రంతో పూర్వ దేవాల యాల ట్రస్ట్ సంయుక్త రూ.20లక్షల వ్యయంతో దేవాలయంలో గార్డెనింగ్ భక్తుల క్యూ లైన్ కోసం స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేశాం. శివరాత్రి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

దేవాలయ వద్ద భారీ బందోబస్తు: డీఎస్పీ శివరాం రెడ్డి

శివరాత్రి పర్వదిన సందర్భంగా దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. దేవాలయ వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్న అక్కడ ఉన్న పోలీస్ శాఖకు సమాచారం అందించాలని కోరారు.

తెల్ల రేషన్ కార్డు లేని పేదలందరికీ సబ్సిడీ గ్యాస్, ఉచిత కరెంటు ఇవ్వాలి

● వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

నవతెలంగాణ-కేతపల్లి



తెల్ల రేషన్ కార్డు లేని, అర్హత కలిగిన వ్యవసాయ కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్ ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని కొండ కింది గూడెం గ్రామంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరయ సభ్యత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్హత కలిగిన పేదలందరికీ ఉచిత విద్యుత్తు సబ్సిడీ గ్యాస్ ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించి ఇస్తానని చెప్పడం మూలంగా వ్యవసాయ కార్మికులంతా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని వెంటనే ఆ మాటను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు.ప్రభుత్వము ప్రతి పథకం అమలుకు రేషన్ కార్డు ముడిపెట్టడంతో చాలామంది పేదలకు గత పది పదిహేను సంవత్సరాలుగా గత ప్రభుత్వాలు రేషన్ కార్డులు ఇవ్వక అర్హత కలిగిన పేదలు రేషన్ కార్డు లేక అనేక అవస్థలు పడుతున్న పరిస్థితి ఉన్నదన్నారు.రేషన్ కార్డు లేకపోవడంతో గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు అర్హత కలిగిన , పేద వ్యవసాయ కార్మికులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.జిల్లా లో కరువు తీవ్రంగా ముందుకు వస్తున్న పరిస్థితి ఉన్నదని అక్కడక్కడ పంట పొలాలు కూడా వెండి పోతున్నాయని వాటన్నింటినీ ప్రభుత్వ అధికారులు అంచనా వేసి వారికి నష్టపరిహారం అందే విధంగా తగు చర్యలు తీసుకుని, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు. జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి లూర్దు మారయ్య. గ్రామ అధ్యక్షులు, పెరికే ధనమ్మ. కార్యదర్శి దొంతం జానయ్య నాయకులు పెరికే సదానందం .అల్లి వెంకటయ్య కంభంపాటి మంగమ్మ నర్సింగు ధనమ్మ . రాములు .వెంకటేశం నరసయ్య పాల్గొన్నారు.

స్వపరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-హాలియా



మండలం ఇబ్రహీం పేట ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలనా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు అధికారులుగా ఉపాధ్యాయులుగా ప్రజా ప్రతినిధులుగా తమ పాత్రలను చక్కగా పోషించి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులుగా, అధికారులుగా మోక్షిత్ వర్ష పావని, లాస్య, ఝాన్సీకావ్య, జస్వంత్, శివశరత్ తదితరులు వ్యవహరించారు. పాఠశాలను చక్కగా నిర్వహించిన విద్యార్థులను ఉపాధ్యాయులు కె. దయాకర్ రెడ్డి, ఎం. శంకరాచారి, ఓ. సరిత, డి. మహేశ్వరి, ఎస్ కె జమీలా బేగం తదితరులు అభినందించారు.

పద్మశాలి భవన నిర్మాణానికి సహకరించాలని వినతి

నవతెలంగాణ- చిట్యాలటౌన్



మున్సిపాలిటీ కేంద్రంలో ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను చిట్యాల పద్మశాలి కులస్తులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని పద్మశాలి కులస్తులకు చెందిన స్థలంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు వారు చిట్యాల మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డితో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కులస్తులు... జెల్లా మనోహర్, గంజి వెంకటేశం, మిర్యాల ప్రకాష్, పున్న పాండుజీ , జెల్ల సత్తయ్య ఈపూరి యాదగిరి, మూడ వేణు, చెరుపల్లి శ్రీనివాస్ ,ఇనుగంటి కృష్ణయ్య, గంజి అంజయ్య, మిర్యాల ఆంజనేయులు, రచ్చ దామోదర్, రాపోలు లక్ష్మయ్య, గంజి యాదగిరి, పొట్టబత్తిని రఘు, కస్తూరి కృష్ణమోహన్, జెల్ల శ్రీకాంత్, మూడ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

మూడేండ్ల బడ్జెట్‌లో సవరింపులే తప్ప అభివృద్ధి శూన్యం

● ఎమ్మెల్యే వేముల వీరేశం



నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మున్సిపాలిటీకి సంబంధించి గత మూడు బడ్జెట్లను తాను పరిశీలించానని ఇందులో సవరింపులు తప్ప అభివృద్ధి కనిపించడం లేదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అసంతృప్తి వ్యక్తం చేశారు మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన గురువారం మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు . బడ్జెట్ లో అభివృద్ధికి కేటాయింపులు జరుగుతున్నామని చూపిస్తున్నప్పటికీ అలా చేయకుండా కేవలం సవరింపులు మాత్రమే చూపిస్తున్నారన్నారు. బడ్జెట్ లో రూపొందించిన విధంగా అభివృద్ధి మాత్రం లేదనేది స్పష్టం అవుతుందన్నారు. మున్సిపాలిటీలో ఒకరిద్దరు తప్ప అంతా తాత్కాలిక ఉద్యోగులు మాత్రమే ఉన్నారని, ఫలితంగా డెవలప్మెంట్ విషయంలో పురోగతి ముందుకు సాగడం లేదన్నారు. మున్సిపాలిటీలో 9 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఏ పని చేయకుండా జీతాలు తీసుకుంటున్నారన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీకి పూర్తిస్థాయిలో శాశ్వత ఎంప్లాయిస్ ను నియమించాలి అని కలెక్టర్ తో పాటు తనకు లెటర్ ఇస్తే తాను ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటానన్నారు. మున్సిపాలిటీలకు విపరీతమైన ఆదాయం వస్తున్నప్పటికీ మళ్లీ మళ్లీ సిసి రోడ్లు అంటూ అభివృద్ధి చేయాలని పదేపదే వినతులు వస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించారని దీనిపై కూడా ప్రభుత్వపరంగా ఏం చేయాలనే విషయంపై నిర్ణయాలు జరుగుతున్నాయని చెప్పారు. మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తూ అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా 2024.25 సంవత్సరపు అంచనా బడ్జెట్ ను ఆమోదించారు ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బాలయ్య, వైస్ చైర్మన్ మురారి శెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, కౌన్సిలర్ లు చౌగోని రజిత శ్రీను, కందాల బిక్షం రెడ్డి, పన్నాల పావని శ్రీనివాస్ రెడ్డి, గాజుల సుకన్య, యాసారపు లక్ష్మీ వెంకన్న, దైద స్వప్న, చౌగోని అఖిల, మట్టిపల్లి కవిత గారు. పోతుల సునీత రవీందర్, చౌగోని రాములమ్మ, కొండ శ్రీను, గద్దం స్వామి, భానోత్ వెంకన్న, పల్లె విజయ్, మున్సిపల్ ఏఈ గౌతమ్ రాజు, మున్సిపాల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో ఘనంగా మహిళా దినోత్సవం



నవతెలంగాణ-మిర్యాలగూడ

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆదిత్య పాఠశాలలో గురువారం ఘనంగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ మారుతీ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ నేడు మహిళలు విద్యా, ఉద్యోగ, సామాజిక, రాజకీయ, వ్యాపార రంగాలలో ఉన్నతంగా రానిస్తున్నారని వారి స్ఫూర్తి తో, స్త్రీ, పురుష వివక్ష లేని మహిళా సాధికా రత కలిగి అన్నీ అవరోదాలను అదిగమించి ఆత్మ స్తైర్యంతో విద్యార్థినులు, పురోగమించాలని ఆకాంక్షించారు. ఆదిత్య పాఠశాలలో సంవత్సర కాలం లో తమ తమ విధుల ను సక్రమంగా నిర్వర్తించి, తమ తమ పనులకు న్యాయం చేకూరస్తున్న బోధన మహిళా సిబ్బంది లో మొదటి ఉత్తమ మహిళా గా జె. విజయలక్ష్మి రెండవ ఉత్తమ మహిళా గా ఎం. లక్ష్మి, మూడవ ఉత్తమ మహిళ గా ఎస్. మౌనిక లను గుర్తించి వారిని సన్మానించి, బహుమతులను ప్రదానం చేసారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయి నీ, ఉపాధ్యాయ లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, సౌండ్ సిస్టం అందజేత

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



మండలంలోని అల్లాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు లక్ష రూపాయలతో సౌండ్ సిస్టం,కంప్యూటర్స్ ను సరళ మైసమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ అర్థ వెంకట్ రెడ్డి గురువారం అందజేశారు.ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మన భవిష్యత్తు చదువుకుంటూనే బాగుపడుతుందని పిల్లలతో చెప్పారు.ప్రాథమిక పాఠశాలలోనే భవిష్యత్తులో ఏమి కావాలో నిర్ణయించుకోవాలని అన్నారు.ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రయోజకులుగా తయారు అవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు వరకాంతం మహిపాల్ రెడ్డి మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి కొలను మాధవరెడ్డి సింగిరెడ్డి మహిపాల్ రెడ్డి ఉపాధ్యాయులు జంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన బండారు రామయ్య ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారికి అదే గ్రామానికి చెందిన ఎజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు గురువారం అందజేశారు.

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్



ఎల్ఆర్ఎస్ పై కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నాల్కల ధోరణిలో వ్యవహరిస్తుందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మండిపడ్డారు.ఎల్ ఆర్ ఎస్ ను ఉచితంగా అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్ పై భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క విమర్శించి నేడు అధికారంలోకి రాగానే మాట మార్చారని దాదాపు 20వేల కోట్ల రూపాయలు సామాన్య ప్రజానీకమైన రైతులు, పేద, మధ్యతరగతి వర్గాల నుంచి వసూలు చేయాలని కుట్ర పన్నారని ఆరోపించారు.స్థానిక మంత్రి అయిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో కోర్టుకెళ్లారని ఇప్పుడు వారి ప్రభుత్వమే ఎల్ఆర్ఎస్ తో నడ్డి విరుస్తుంటే ఎక్కడికి వెళ్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలోమాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు చీర పంకజ్ యాదవ్, బొర్ర సుధాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, కనగల్ ఎంపీపీ కరీం పాషా, కౌన్సిలర్ మారగోని గణేష్, సింగిల్ విండో చైర్మన్ లు, వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు, బక్క పిచ్చయ్య, సింగం రామ్మోహన్, బకరం వెంకన్న, జమాల్ ఖాద్రి, కంచనపల్లి రవీందర్ రావు, లోడంగి గోవర్ధన్, పట్టణ పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, నల్గొండ తిప్పర్తి ,కనగల్ మండల అధ్యక్షులు దేప వెంకట్ రెడ్డి, పల్ రెడ్డి రవీందర్ రెడ్డి,అయితగొని యాదయ్య, తిప్పర్తి వైస్ ఎంపీపీ ఏనుగు వెంకట్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మెరుగు గోపి, గుండ్రెడ్డి యుగంధర్ రెడ్డి,నాయకులు కందుల లక్ష్మయ్య, వనపర్తి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పురుషోత్తం మాజీ డైరెక్టర్ లు ఏజాజ్ అహ్మద్, దేప అమృత రెడ్డి తదితరులుపాల్గొన్నారు.



శివాలయంలోకి మురుగునీరు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలోని శివాలయంలోకి గురువారం మురుగునీరు వచ్చి చేరింది. మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ వెనక్కి తట్టి ఆలయంలోకి సైతం వచ్చిచేరింది. మురుగు కాలువలలో చెత్త, ఇతర కవర్లు జమ కావడంతోనే ఆలయంలోకి మురుగునీరు వచ్చిందని స్థానికులు తెలిపారు. మురికి కాల్వల శుభ్రత ఎప్పటికప్పుడు నిర్వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. వెంటనే పురపాలక శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆలేరు పట్టణ పరిశుభ్రతపై డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-వలిగొండ రూరల్

వేములకొండ గ్రామానికి చెందిన ఇంజమూరి బిక్షం ఇటీవల అనారోగ్యానికి గురై రెండు కాళ్లు పనిచేయక నడవలేని స్థితిలో ఉన్న అతనికి మానవతా హృదయంతో వలిగొండ జెడ్పీటీసీ వాకిటి పద్మా అనంతరెడ్డి గురువారం ఐదువేల రూపాయలు, అదేవిధంగా కేసిరెడ్డి రాజనర్సింహారెడ్డి జ్ఞాపకార్థం యాదాద్రి జిల్లా మహిళా కాంగ్రెస్ సెక్రెటరీ నీరజ వెంకటేశ్వరరెడ్డి ఐదువేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పులిపలుపుల రాములు, ఏర్పుల వెంకటేశం, ఎస్.కె రసూల్, కట్ట సత్తయ్య, ఎలగందుల కృష్ణమూర్తి, యాదయ్య, నరసింహ, పట్టేటి జగన్ పాల్గొన్నారు.

లింగయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు



నవతెలంగాణ-నూతనకల్

సీపీఐ(ఎం) కార్యకర్త దూదిగాం లింగయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకేపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన సిపిఎం కార్యకర్త దూదిగాం లింగయ్య సంతాప సభకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అతను పార్టీ బలోపేతం కోసం కృషి మరువలేనిది అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడిగా పనిచేస్తూ కార్మికులకు వచ్చిన అనేక ఇబ్బందులను పరిష్కరించడంలో ముందున్నారని అన్నారు. సమ సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యం అన్నారు. దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం,నిరంతరం శ్రమ జీవులను ఏకం చేసి పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. నేటి పాలకులు ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత పేద ప్రజల పరిష్కరించకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి బత్తుల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్ రెడ్డి, ఫులుసు సత్యం గ్రామ మాజీ ఉపసర్పంచ్ దూదిగం చిన్న ఎల్లయ్య, మల్యాల ప్రవీణ్, దూదిగం మల్లయ్య, కూసు సైదులు, దూదిగం చంద్రయ్య, శ్రీరంగం, గజ్జల శ్రీనివాస్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ



నాగార్జున సాగర్ ఎడమ కాలువకు వారం రోజుల పాటు నీటిని విడుదల చేసి ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులను ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్ లోని సచివాలయంలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ భీమ్ ప్రసాద్ కు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ ఆయకట్టు పరిధిలో రైతులు 30 శాతం వరి నాట్లు వేసుకున్నారని,సాగునీరు విడుదల అవుతుందని కొందరు,బోరు బావుల కింద మరికొందరు రైతులు వరినట్లు వేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్లు బావులు ఎండిపోయాయని ఆయన అన్నారు.వర్షాలు లేక వాగులు చెరువులు కూడా ఎండిపోయాయన్నారు. పంట పొలాలు చేతికొచ్చే సమయం కాబట్టి నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదన్నారు. ఇప్పుడు పంటలు చేతికోచ్చే అవకాశం ఉందని లేకపోతే పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతారని నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

పరీక్ష సామగ్రి అందజేత

నవతెలంగాణ-మోతే

మండల పరిధిలో అన్నారి గూడెం గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు ఉన్నం సత్యనారాయణ రావు చరిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని సిరికొండ మామిళ్లగూడెం ఉన్నంత పాఠశాలల 60 మంది విద్యార్థులకు ఆయన ప్యాడ్స్ పెన్నులు కంపక్షలు పెద్ద స్కేలు పంపిణీ చేశారు పదవ తరగతి పరీక్షలు ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు పదివేల రూపాయ లు ఇస్తానని విద్యార్థుల కు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు లింగారెడ్డి వినోద మోహన్ రావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్త్రీలు విద్యావంతులైతే సమాజం అభివృద్ధి

నవతెలంగాణ-మిర్యాలగూడ



స్త్రీలు విద్యావంతులైతే సమాజం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందడంతో పాటు తన పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలుగుతుందని సామాజికవేత్త డాక్టర్ రాజు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక మిర్యాలగూడ లోని హసీత మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా దినోత్సవం సావిత్రిబాయి పూలే వర్ధంతి పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమూహ రైటర్స్ ఫురం నాయకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందుతూ ఉన్నప్పటికీ స్త్రీలు ఇంకా అనేక అసమానతులను ఎదుర్కొంటున్నారని వీటన్నిటిని సమూలంగా నివారించాలి అంటే స్త్రీలు ఉన్నత విద్య చదవాలని, స్త్రీలు విద్యావంతులైతే మూఢనమ్మకాలు తొలగిపోతాయని,స్త్రీలు ఆర్థిక రాజకీయాలలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెండు వెంకటరెడ్డి,జన విజ్ఞాన వేదిక జె.కొండల్ రెడ్డి, కందుకూరి సుదర్శన్, కళాశాల అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



నవ తెలంగాణ-నకిరేకల్

మండలంలోని నోముల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బిజిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి ఎంపీపీ బాచుపల్లి శ్రీదేవి గంగాధర్ రావు అందజేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులుసామ రవీందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సమాజంలో లింగ వివక్ష లేకుండా చూడాలి

నవతెలంగాణ-పెద్దవూర



మహిళలను గౌరవించే సమాజం ఉన్నతంగా నిలబడుతుందని లింగ వివక్ష లేకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి గంధం పద్మావతి అన్నారు. గురువారం మండలం లోని పర్వేదుల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ తల్లి దండ్రులు లింగ వివక్ష లేకుండా చూడాలని ఆడ, మగ ఇద్దరు సమానమే నని అన్నారు.లింగ వివక్ష అనే ఆలోచన ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ వెంకాయమ్మ, అంగన్ వాడి టీచర్లు, భాగ్యమ్మ, రజిత, జ్యోతి, శారద పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు తేది పొడిగింపు

నవతెలంగాణ-నల్గొండకలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండ ఆధ్వర్యం లో ఉమ్మడి నల్లగొండ జిల్లా కు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు TSPSC గ్రూప్-I ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని,స్టడీ సెంటర్ డైరెక్టర్ కే. విజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు నేరుగా తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్, రోడ్ నెం.9, శ్రీనగర్ కాలనీ, ఎన్జీ కాలేజ్ బ్యాక్ సైడ్, నల్లగొండ నందు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తు గడువును పొడిగించడం జరిగిందనితెలిపారు. అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్లు, డిగ్రీ మెరిట్ అధారంగా ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇతర వివరాలకు టియస్ బిసి స్టడీ సర్కిల్, నల్లగొండ లేదా 08682-220007 నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

విద్యా సంవత్సరం 2023-24కుసంబంధించి విదేశాలలో విద్యా అభ్యసించుటకు గాను అంబేద్కర్ ఓవర్సిస్ విద్యానిధి పథకానికి ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యస్ సి, అభ్యర్థులు ఆన్లైన్ వెబ్సైట్ telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి సంజయ్ దాస్ రాజీనామా

నవతెలంగాణ- చిట్యాలటౌన్

బీఆర్ఎస్సీనియర్ నాయకుడు, పట్టణానికి చెందిన కూనూరు సంజయ్ దాస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. 20 సంవత్సరాలకు పైగా బీఆర్ఎస్ పార్టీలో మాజీ మంత్రి గుంట కండ్ల జగదీశ్ రెడ్డి కి ముఖ్య అనుచరునిగా ,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సన్నిహితునిగా పేరున్న సంజయ్ దాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాల విషయంలో తీవ్ర అసంతృప్తికి గురై రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్ కార్యాచరణను తర్వాత ప్రకటిస్తానని అన్నారు.

శివ శెట్టి గౌరయ్యకు నివాళులర్పించిన దైద రవీందర్

నవతెలంగాణ-చిట్యాలటౌన్



మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు శివశెట్టి గౌరయ్య దశదిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నమ్ముల విజయ్ కుమార్, ఎంపీటీసీ దుబ్బ పద్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బత్తుల సత్తయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు బత్తుల మల్లేష్ గౌడ్ ,మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి బుచ్చిరెడ్డి ,దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ గోపాల్ ,నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్ దోర్నాల రామచంద్రు, మత్స్యశాఖ అధ్యక్షుడు అన్నబోయిన రమేష్, బండ అంజయ్య, బండ కృష్ణయ్య ,బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నకిరేకల్



మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన దూరేపల్లి సైదమ్మ ఇటీవల అకాల మృతి చెందారు. గురువారం బి జి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచుపల్లి గంగాధర్ రావు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మాజీ ఉపసర్పంచ్ చింతల శ్రీను, సెల్ మండల నాయకులు బొల్లెద్దు లక్ష్మయ్య , బొల్లేదు అంజయ్య, కొప్పుల వెంకన్న, బచ్చుపల్లి లింగరావు, మున్నీర్, కందికంటి సతీష్ పరామర్శించారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా మొండికది లింగయ్య

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మొండి కత్తి లింగయ్య ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికల్లో ఆయనను రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మర్మల మల్లేష్ చేతుల మీదుగా ఏకగ్రీవ తీర్మానం తో పాటు నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు, సామాజిక అంశాల పైన దండోరా పని చేస్తుందన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా స్వపరిపాలనా దినోత్సవ వేడుకలు

- మాజీ సింగిల్ విండో చైర్మెన్ బాణాల సత్యనారాయణ రెడ్డి సహాయం అభినందనీయం

నవతెలంగాణ-నూతనకల్

మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని చిల్పకుంట్ల తాళ్ల సింగారంతో పాటు పలు ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా స్వపరి పాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వపరిపాలన దినోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాజీ సింగిల్ విండో చైర్మన్ బాణాల సత్యనారాయణ రెడ్డి తమ సొంత ఖర్చులతో బహుమతులను అందజేయటాన్ని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ సోమయ్య వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఎండి ఆజీమోద్దీన్ ,జలగం క్రాంతి ప్రభ, శ్రావణ్ బిక్షమయ్య, రేపాక లింగయ్య రామాచారి సైదులు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ మండల పరిధిలోని లింగాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కాగా డీఈఓగా మామిడి హయతి, ఎంఈఓగా మామిడి భవ్యశ్రీ, హెచ్ఎంగా ఓర్వాల నాగేంద్రచారి, ఉపాధ్యాయులుగా చలిగంటి యూనికే, మామిడి జాగృతి, వైష్ణవి, దుర్గాభవాని, శాన్విత, బాలశ్రీ, అమూల్య తదితరులు విధులు నిర్వహించి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి మురిసిపోయారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాములు విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, గోవిందు, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగారం నాగారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పస్తాల ,వర్ధమానుకోట ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాత్ర పోషించి పాటలు బోధించారు. జిల్లా అధికారులుగా రాజకీయ నాయకులుగా వివిధ వేషధారణలో తమ పాత్రలను పోషించారు. అనంతరం ఏర్పాటు చేసిన



నూతనకల్...

కార్యక్రమంలో ఆయా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాసం చక్రిధర్, వర్దేల్లి మల్లయ్య, ఉపాధ్యాయునిలు నిర్మల, అనిత, జయమ్మ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలటౌన్ మండలంలోని తాళ్లవెల్లంల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలనా దినోత్సవం ఘనముగా జరుపుకున్నాము .ఈ సందర్భంగా విద్యార్థులే ఒక్కరోజు అధికారులుగా ,నాయకులుగా ,ఉపాధ్యా యులుగా అనుకరించి ఆకట్టుకున్నారు.ఈ సందర్భంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్ .సైదులు ,మాజీ సర్పంచ్ జనగాం రవీందర్ గౌడ్ ,ఉపాధ్యాయులు ఏ ఆంజనేయులు, వి కిరణ్ కుమార్, యం శ్రీనివాసులు , కే కాటమయ్యయం.లింగారెడ్డి పాల్గొన్నారు.

నకిరేకల్మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరి పాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు ఉపాధ్యాయుల అధికారుల వేషధారణలో చూపరులను ఆకట్టుకు న్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వంటల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సిహెచ్.నర్సయ్య, ఎస్.యాదమ్మ, టి.నర్సింహమూర్తి, కె.సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్ జిల్లా కోఆర్డినేటర్ కాసా అనసూయ మాట్లాడుతూ మహిళలు లేనిది సృష్టి లేదన్నారు. మహిళలు ఎంతో సహనంతో తమ ఇంటిని సమాజాన్ని, సన్మార్గంలో నడిపించడంలో ముందు వరుసలో ఉన్నారని అన్నారు. గృహ కార్మికులకు ప్రభుత్వం ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం మంజూరు చేస్తూ వారానికి ఒకరోజు సెలవు దినం ఇచ్చే విధంగా చట్టాలు తీసుకురావాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 10 లక్షల మంది గృహ కార్మికులు పనిచేస్తున్నారని వారి సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని అన్నారు.వారి పిల్లల చదువుల కోసం ప్రభుత్వం స్కాలర్షిప్ లను ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పాల్వాయి సుహాసిని, ఉపాధ్యక్షురాలు అక్కినపల్లి పద్మ, జిల్లా కార్యదర్శి నిర్మల, చంద్రమ్మ, రాములమ్మ, జానమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు ఎవరి పేరున ఉన్నా.. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ఆరు గ్యారెంటీ పథకాల కోసం కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరున దరఖాస్తు చేసుకున్నా అన్ని పథకాలు వర్తించేలా అమలు చేయాలని బీఆర్టీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వెంపటి గురూజీ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఇదే హామీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారులకు ఎవరి పేరున దరఖాస్తు ఉంటే వారికి వస్తుందని అధికారులు చెప్పడంతో ప్రజల్లో గందరగోళం వాతావరణం నెలకొందని అన్నారు. కుటుంబంలో భార్య, భర్త, పిల్లలు ఎవరు దరఖాస్తు ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీం లు వర్తింప చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను ఐక్యం చేసి ప్రభుత్వంపై ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి నయీమ్, హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు పచ్చిపాల ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీలు పురుషులతో సమానం

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

సమాజంలో స్త్రీలు పురుషులతో సమానమని అంగన్వాడిని సూపర్వైజర్ తిప్పర్తి రాధా అన్నారు. గురువారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో నేడు జరుపుకునేటటువంటి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను అడ్వాన్స్ గా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పురుషుడు కూడా స్త్రీలను గౌరవించాలని లింగ వివక్ష లేకుండా బృణ హత్యలు చేయకుండా ఆడపిల్లలను కాపాడాలని స్త్రీలు అన్ని రంగాలలో పనిచేస్తున్నారని. ప్రతి ఒక్కరు కూడా మహిళలను గౌరవించాలని ఆడపిల్లను పనిలో పెట్టకుండా మగ పిల్లలతో సమానంగా ఉన్నత చదువులు చదివించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రామలింగయ్య, అంగన్వాడిని టీచర్లు బుచ్చమ్మ, భారతమ్మ, లాలమ్మ ఉపాధ్యాయులు వెంకటయ్య, లక్ష్మణ్, శ్రీరాములు, సునీత ,విజయ ,ప్రిస్కిల్లా, వరలక్ష్మి, లక్ష్మి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల విందుగా శివ పార్వతి కల్యాణ వేడుకలు

నవతెలంగాణ-నూతనకల్

మండల కేంద్రంలోనీ శ్రీ పార్వతీ సమేత శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో నేడు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కనుల విందుగా, వైభవంగా జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అర్చకులు శ్రీరామ శర్మ తెలిపారు. గురువారం కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని మామిడి తోరణాలు కట్టి కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం గణపతి పూజ, అఖండ దీపారాధన, మండపార్చన, గణపతి, రుద్రమల పూజలను నిర్వహించారు. నేడు ప్రత్యేక రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు, బలిహరణ, ఎదుర్కోలు, స్వామివారి కల్యాణం నిర్వహించబడతాయని తెలిపారు.శ్రీరామ కళ్యాణానికి సంబంధించిన శ్రీ సీతారాముల లక్ష్మణ ఆంజనేయ ఉత్సవమూర్తులను (విగ్రహాలను) పంచలోహాలతో తయారు చేయించినట్లు తెలిపారు. ఉత్సవమూర్తుల ఏర్పాటుకు,ఆలయానికి వేయించిన రంగులకు, మకర తోరణాలకు దాతలుగా ముందుకు వచ్చి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమా మల్లారెడ్డి, సురకంటి చంద్రారెడ్డి, మద్దెల రామ్మూర్తి, బత్తిని లక్ష్మయ్య,యాస శ్రీనివాసరెడ్డి, భీమిడి నారాయణరెడ్డి, యాస ముత్తారెడ్డి,భూపతి వెంకన్న, ఉప్పుల రాజలింగం,ఆలయ అర్చకులు దరిపెల్లి వరలక్ష్మి, శ్వేత,సాయి తేజ శర్మ, గ్రామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులు

నవతెలంగాణ-నకిరేకల్

ప్రభుత్వ ఉపాధ్యాయులు గింజల ప్రభాకర్ రెడ్డి మాతృమూర్తి గింజల మాణిక్యమ్మ దశదినకర్మ గురువారం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు వంటపాక అంబేద్కర్, మామిడికాయల నాగయ్య, గింజల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, వంటపాక నరసింహ, కొండ శీను నాగరాజు వంటపాక సైదులు రాజశేఖర్ సతీష్ మహేష్ అశోక్ నరేష్ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలోని ఖుధాబక్షిపల్లీ గ్రామ పేద రైతుల పేర్ల మీద ఉన్న భూ రికార్డులను,పట్టాదారు పాసపుస్తకాలను గతంలో అక్రమంగా తొలగించారు రికార్డులను పరిశీలించి మరలా రైతులకు(శీలింగ్ భూమి) పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలనీ కోరుతూ గురువారం భారత కమ్యునిస్టు పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ తారక రామన్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి బూడిద సురేష్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పదవ తరగతి ప్రశ్నాపత్రాలు

నవతెలంగాణ-తుంగతుర్తి

ఈనెల 18 నుండి 30 వరకు జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సెట్-1పరీక్ష పత్రాలు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్కు చేరినట్లు మండల విద్యాశాఖ అధికారి బోయని లింగయ్య తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, మొత్తం నాలుగు కేంద్రాలలో కలిపి 700 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. స్థానిక ఎస్సై ఏడుకొండలు, ఏఎస్ఐ భగవాన్ ల సమక్షంలో స్టేషన్ లాకప్ రూమ్‌లో పరీక్షా పత్రాలను భద్రపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కస్టోడియన్ అశోక్ జాయింట్ కస్టోడియన్ కొండగడుపుల యాకయ్య అన్ని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపర్డెంట్లు డెవలప్మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

నవతెలంగాణ -మిర్యాలగూడ



ప్రజాస్వామ్య పరిరక్షణ నేటి పౌరుల ప్రథమ కర్తవ్యమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య అన్నారు. గురువారం స్థానిక కరీం ఫంక్షన్ హాలులో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కార్పొరేటికరణ వైపు పరుగులు తీస్తుందంటే ప్రజాస్వామ్యనికి ముప్పు పొంచి ఉన్నట్టేనని ఆయన అన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలు ప్రమాదకరంగా ప్రధాని మోడీ తీసుకు వచ్చారు, ప్రతిఘటన పెద్దగా కనిపించలేదు, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకు రాగా తీవ్రంగా ప్రతిఘటించారు. ఇలాంటి చట్టాలు తీసుకు వచ్చినప్పుడు ప్రజలు స్పందించాలన్నారు. స్పందించకుంటే ప్రజాస్వామ్యానికే ముప్పు ఉంటుందన్నారు. ఈవిఎమ్ లపై రాజకీయ పార్టీలు స్పందించాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కార్యాచరణ ఉండాలని బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జెరాజు అన్నారు. ఈవిఎంలు వద్దంటు బాంసెఫ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో భారీ ప్రదర్శన చేశామని బిఎం పి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య అన్నారు. ప్రముఖ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు ఎంఎస్.రెడ్డి(ఎంఎస్ఆర్) అధ్యక్షత వహించగా నిర్వాహకులు అడ్వకేట్ ఎంఎ.జబ్బార్, ఎంఎ. ఖాదర్, యూసఫ్ జిలాని, ట్రేడ్ యూనియన్ నాయకులు, సామాజికవేత్త రామయ్య, ఎంఎ.సమీఖాద్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఎండి.కూతుబుద్దీన్, ఎఐఎంఐఎం జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారుక్, స్వాతంత్ర భారత్ పార్టీ సందీప్ కుమార్, మొహ్సిన్ ప్రసంగించారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా మల్లేశ్ ఎన్నిక

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

బీజేపీ చౌటుప్పల్ మండల అధ్యక్షునిగా పంతంగి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు చినుకని మల్లేశ్ యాదవ్‌ను బుధవారం సాయంత్రం భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన చినుకని మల్లేశ్‌యాదవ్ తన ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్‌కి, ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ మండలాధ్యక్షునిగా పూజారి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

భారతీయ జనతా పార్టీ ఆలేరు మండల అధ్యక్షునిగా పూజారి కుమారస్వామిని నియమిస్తూ గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కార్యదర్శులు పాశం భాస్కర్ , ఉట్కూరి అశోక్ గౌడ్‌లు పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పూజారి కుమారస్వామి మాట్లాడుతూ మండల అధ్యక్షునిగా నియమించినందుకు గాను జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఉట్కూరు అశోక్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆలేరు అసెంబ్లీ కన్వీనర్ చిరిగే శ్రీనివాస్ బిజెపి నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ పట్టణశాఖ అధ్యక్షునిగా సాహెష్

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

బీజేపీ భూదాన్ పోచంపల్లి మున్సిపల్ పట్టణ శాఖ అధ్యక్షులుగా డబ్బి కార్ సాహెష్ నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తననియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లి పట్టణంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఏలేశ్వరం..చూసొద్దాం!

- ప్రత్యేక లాంచీలను నడపనున్న టూరిజం శాఖ
- చరిత్రకు సజీవసాక్ష్యం ఏలేశ్వరం గట్టు
- పెద్దలకు రూ.200,పిల్లలకు రూ.150 టికెట్ ధర
- గుట్టకు అధిక సంఖ్యలో హాజరుకానున్న భక్తులు

నవతెలంగాణ-నాగార్జునసాగర్



నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో.. నాగార్జున కొండకు సమీపాన ఉన్న ఏకైక కొండ ఏలేశ్వరం. సాగర్ రిజర్వాయర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లను ఆహ్వానిస్తున్నట్లు నదీ ముఖంగా.. అత్యద్భుత ప్రకృతి సౌందర్యాన్ని కలిగిన రెండు శిఖరాలు కలిగి ఏకైక గుట్టగా విరాజిల్లుతోంది. గుట్ట పైన స్థానం లేక వేల ఏళ్ల క్రితం ఈ కొండ పాదాల చెంతనే నూటొక్క గుళ్లు.. ముక్కోటి దేవతల విగ్రహాలు, చెక్కిన కోటొక్క శిలలు ఉండేవని స్థానిక స్థల పురాణం చెప్తోంది. సాగర్ జలాశయ నిర్మాణానికి ముందు 1962 వరకు నిత్య పూజలు అందుకున్న ఇక్కడి కొండ.. ప్రాజెక్టు నిర్మాణంతో ఒంటరయ్యింది. ముంపునకు ముందు చేపట్టిన తవ్వకాల్లో ఏలేశ్వరం వద్ద లభించిన వందలాది చారిత్రక శాసనాలు, వేలకొలది దేవతా విగ్రహాలు ఇప్పటికీ పలు జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోనూ పురావస్తు శాఖ మ్యూజియాల్లో కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. వేల ఏళ్లనాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

అత్యద్భుత ప్రకృతి ఒడిలో ఒదిగి ఉన్న ఏలేశ్వరం కొండ

నేటి రెండు తెలుగు రాష్ట్రాలను అన్నపూర్ణగా మార్చిన సాగర్ ప్రాజెక్టు నిర్మాణం 60ఏళ్ల క్రితమే ప్రారంభం కాగా.. ఈ బృహత్ జలాశయం విస్తీర్ణం అంతా ఇంతా కాదు. వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 4మండలాల మేర కృష్ణా నీటి పరవళ్లను నందికొండ వద్ద బంధించిన నిర్మాణమే.. నేడు మనం చూస్తున్న నాగార్జున సాగరం. ఈ జలాశయం మధ్యలోనే అలనాటి బౌద్ధ విశ్వవిద్యాలయ ఆనవాళ్లు పొందుపర్చుకున్న నాగార్జున కొండ ఉన్న విషయం తెలిసిందే. కానీ దానికి కొద్ది దూరంలోనే అంతకంటే ఎక్కువ చారిత్రక నేపథ్యం, విస్తృతమైన ఆధ్యాత్మిక అనుబంధం కలిగిన ఏలేశ్వరం గుట్ట ఉందన్న సంగతి ఎవరికీ తెలియకపోవడమే విచారకరం.కాత్యాయనీ సహిత మల్లికార్జునస్వామి వార్ల ఆలయాలతో కూడిన ఏలేశ్వరం మల్లన్న గుట్ట సాగర్ ఆనకట్టకు సుమారు 10కిలోమీటర్ల దూరంలో ఉంది. చందంపేట మండలం బుగ్గతండా, పొగిళ్ల గ్రామాలకు సమాన దూరంలో ఉంటుంది. జలాశయంలో తొలిసారి నీటిని నింపిన నాటి నుంచి ఈ గుట్టకు రాకపోకలు బంద్ అయ్యాయి. నాగార్జున కొండలో బుద్ధుడు, నాగార్జునుడి ఆనవాళ్లను పొందుపరిచి పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చిన నాటి సమైక్య ప్రభుత్వాలు.. అంతకు మించిన చారిత్రక ప్రాముఖ్యతను.. వేల ఏళ్ల క్రితమే దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం ఏలేశ్వరాన్ని విస్మరించాయి.

ఏటా రెండుసార్లు మాత్రమే లాంచీలు

ఏలేశ్వరం గుట్టపైన సరిపడా స్థలం లేనందున కింద 101 ఆలయాలు.. ముక్కోటి దేవతల విగ్రహాలు చెక్కిన కోటొక్క శిలలు ఉండేవని చెప్తుంటారు. పురావస్తు శాఖ తవ్వకాల్లో లభించిన వేలాది విగ్రహాలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. శ్రీశైలానికి సరైన రహదారి మార్గం లేక.. అక్కడికి వెళ్లలేని ఎక్కువ మంది భక్తులు ఏలేశ్వరంను సందర్శించేవారని.. అప్పట్లోనే దక్షిణ కాశీగా ఏలేశ్వరం ప్రసిద్ధి చెందిందని ముంపు గ్రామాల ప్రజలు నేటికీ చెప్పుకుంటుంటారు.ప్రతి ఏటా ఏకాదశి, శివరాత్రి సందర్భంగా రెండు, మూడు రోజులపాటు ప్రత్యేకంగా లాంచీలు ఏర్పాటు చేయడంతో భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కార్తీక పౌర్ణమి, శ్రావణ మాసంలోనూ లాంచీలు నడిపేందుకు అనుమతి లభించినా.. ప్రస్తుతం అవి చేపట్టడం లేదు. మిగిలిన సమయాల్లో మాత్రం ఇక్కడికి వెళ్లాలంటే ప్రత్యేకంగా అనుమతులు తీసుకుని.. ప్రైవేటు పడవల్లో వెళ్లాల్సిందే.దక్షణ ప్రాంతంలో కృష్ణానది తీరంలో ఉన్న ఏలేశ్వరం గ్రామం చరిత్ర ప్రసిద్ధి పొందింది. ఇక్కడ పర్వతం మీద కాత్యాయని సమేత ఏలేశ్వరస్వామి దేవాలయం నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో చరిత్రక ఏలేశ్వరస్వామి క్షేత్రం, శివరాత్రినాడు మాత్రమే ప్రత్యేక లాంచీలు, సంతనస్వామి చెంతకు చేరుకునే అరుదైన అవకాశం. ప్రకృతి అందాల నడుమ జూలు విప్పిపడుకున్న సింహం ఆకారంలో కొండగట్టు ఉంటుంది.

అలయ విశిష్ట

నాగార్జునసాగర్ జలాశయం మధ్యలోనికి కాత్యాయనీ ఏలేశ్వరస్వామిక్షేత్రం ఎంతో మహిమానిత్యం గలదని భక్తుల నమ్మకం. ఈ ఆలయంలో మహాశివరాత్రి రోజున ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. 1962కు ముందు ప్రతి ఏడాది తొలి ఏకదశి, మహాశివరాత్రి సందర్భంగా 21రోజులపాటు వైభవంగా ఉత్సావాలు జరిగేవని ప్రతీతి. ఇప్పటికి గుట్టపై కాత్యాయని దేవి ఆలయం, ఎగువన మల్లిఖార్జున ఆలయాలు కాకతీయుల కాలంలో ఘనమైన పూజలు అందుకున్నట్లు ఏలేశ్వరంలో లభించిన శాసనాల ద్వారా తెలుస్తుంది. గణపతి దేవుడితో సహా ఎందరో రాజులు ఇక్కడ సమీపంలోని గ్రామాలకు గ్రామాలనే ఏలేశ్వరస్వామికి పూజల నిమిత్తం భూములులను ధారధత్తం చేసినట్లు తెలుస్తుంది. ఇతిహాసయుగంలోనే ఏలేశ్వరస్వామి వెలసిననట్లు గ్రంధాల ద్వారా తెలుస్తుంది. కుశాద్వాజుని కుమార్తై "ఏల" తపస్సు చేసి శివసాక్షత్సరం పొందడం వల్లనే ఈ క్షేత్రం ఏలేశ్వరంగా పేరు గాచిందని శ్రీశైలం స్థల పురాణంలో ఉంది. ఏలేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో మాధవస్వామి, ఆంజనేయస్వామి, మలమ్మ, మాధవస్వామి ఆలయాలు ఉన్నాయి.కోర్కెలు తీర్చెదైవంగా భక్తుల నమ్మకం, హరిహర మల్లన్న, సంతన మల్లన్న, సాక్షిమల్లన్నగా కొలుస్తారు. ఈ క్షేత్రంలో 101 గుడి, కోటొక్క, శిలా, వేయికవ్వములు ఆడినట్లు పెద్దలు చెబుతారు. సంతానంలేని వారు నదిలో స్నానం చేసి నోటిలో నువ్వులు పెట్టుకుని కొండపై ఉన్న బండపై ఉమ్మితే ఎన్నినువ్వులు పూస్తే అంతమంది పిల్లలు పుడతారని భక్తుల నమ్మకం. ఈ క్షేత్రం శ్రీ ఈశాన్య ద్వారంగా, దక్షిణకాశీగా పేరొందింది. పలనాటి బ్రహ్మనాయుడు యుద్ధం చేసి తలదాచుకోవడానికి ఇక్కడికి వచ్చాడనీ, అప్పుడు మొసలి బారిన పడినప్పుడు తన ప్రాణాల్ని కాపాడమని ఈశ్వరుని వేడుకుంటాడు. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యేక్షమై మొసలి బారి నుంచి కాపాడాడు. ఆ కృతజ్ఞతతో "పలనాటిబ్రహ్మనాయుడు" భక్తితో కొండ పైకి ఆలయం వరకు మెట్లు కట్టించాడని చరిత్ర చెబుతోంది.

నాగార్జునసాగర్ నుండి ఏలేశ్వరం కొండకు లాంచీల ఏర్పాటు

చిన్న రామస్వామి,ఆలయ కమిటీ చైర్మెన్

నాగార్జునసాగర్ నుండి జలాశయం మధ్యలో ఉన్న ఏలేశ్వరం కొండకు పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో నడిపే లాంచీలను మహాశివరాత్రిని పురస్కరించుకొని నేడు 8 వ తేదీన ఉదయం నుండి సాయంత్రం వరకు లాంచీలను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్నట్లు టూరిజం శాఖ అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని విజయవిహార్ వద్ద గల లాంచీ స్టేషన్ నుండి ఏలేశ్వరం కొండకు ఏర్పాటు చేస్తున్నామని పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 టికెట్ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. శివరాత్రి రోజు ఉదయం 6గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు లాంచీల రాకపోకలకు ప్రతి రెండు గంటలకొకసారి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏలేశ్వరం మల్లయ్య గట్టు జాతర మార్చి 8 న నిర్వహిస్తున్నట్లు దేవాలయ పూర్వవైభవ వ్యవస్థాపక చైర్మన్ చంద్రవంక చిన్నరామస్వామి తెలిపారు.రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

త్వరలో మిర్యాలగూడ కోర్టు సముదాయానికి సోలార్ విద్యుత్ సౌకర్యం

- ఐదో అదనపు జిల్లా జడ్జి వేణు

నవతెలంగాణ-మిర్యాలగూడ



రాష్ట్ర హై కోర్టు ఆదేశాల మేరకు మిర్యాలగూడ కోర్టు సముదాయంలోని కోర్టు భవనాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా జడ్జి జి.వేణు తెలిపారు. మిర్యాలగూడ కోర్టు సముదాయానికి సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసిన వివరాలను గురువారం ఆయనను అడగగా రాష్ట్ర హై కోర్టు రాష్ట్రంలోని రెండు కోర్టులు పైన ఉన్న కోర్టు సముదాయాలనుసంప్రదాయతర ఇందనం ను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పర్యావరణ పరిరక్షణ, జల, థర్మల్ విద్యుత్ వినియోగం పెరిగుతున్నందున అంతరాయం లేకుండా సౌర విద్యుత్ అందించాలన్న ఉద్దేశ్యంతో సోలార్ ప్లాంట్లను ఆయా కోర్టు సముదయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారని ఆయన తెలిపారు. అందులో భాగంగా మిర్యాలగూడ సముదాయంలో 25 కిలో వాట్స్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యమున్న సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సామాగ్రి పంపించారని తెలిపారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ గ్రిడ్ లోకి వెళ్తుందని, టీఎస్ పిడిసిఎల్ కు విద్యుత్ బిల్లు చెల్లింపు భారం కోర్టుసముదాయానికి తగ్గుతుందని ఆయన అన్నారు. సముదాయంలోని అదనపు జిల్లా కోర్టు, సబ్ కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు సరిపోను విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశాలున్నాయని, మిగులు ఉంటే విద్యుత్ కు ట్రాన్స్ కో లెక్కలు ఇస్తారని ఆయన అన్నారు. వైరింగ్ పనులున్నాయని త్వరలో సోలార్ విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు.